Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై
బ్రాడ్‌షీట్

# కులం, జనగణన, ప్రజాస్వామ్యం
## భిన్న దృక్పథాలు

*సంచిక : 2(త్రైమాసికం)* *తెలుగు & ఇంగ్లీష్* *జూన్ 2011* *విరాళం : 10 రూ.*



<u>విషయసూచిక</u>


- సంపాదకీయం
- కులం లెక్క తేల్చాల్సిందే
  *దుర్గం సుబ్బారావు*
- జనగణనలో కులాల్ని లెక్కిస్తే భారత దేశం కుల సమాజంగా మారిపోతుందా ?
  కె.సత్యనారాయణ
- బాక్స్ ఐటమ్‌లలోని సమాచారం వివరణలను అందించినవారు
  కె.వై. రత్నం, తెలుగుఅనువాదం : కె. సజయ
- కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు–రాజ్యాంగం రీత్యా అవసరం
  *రవివర్మ కుమార్*
- కులం, జనగణన: ముందు చూపుతో ఆలోచిద్దాం!
  *సొనాల్దే దేశాయి*
- జనాభా లెక్కలలో కులగణన ఎందుకుండకూడదు?
  వి.కె.నటరాజ్
- కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు
  సతీష్ దేశ్‌పాండే, మేరీజాన్


*<u>ప్ర</u>త్యేక సంపాదకులు : ప్రొ॥జి.కృష్ణారెడ్డి, డా॥కె.వై.రత్నం, ప్రొ॥చెన్న బసవయ్య*

***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మేల్కొటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శతృఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

*ప్రచురణ సంస్థ :* **అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

***ఫొటో*** *: అనుపమ్ నాథ్ / ఎ.పి., గార్డియన్, యు.కె., 11-2010-జూన్, సౌజన్యంతో.*

# సంపాదకీయం

2011 జనగణన జరిగే సమయానికి కుల గణనపై రెండు దశాబ్దాలుగా అకడమిక్ మరియు పొలిటికల్ రంగాలలో నడుస్తూ వచ్చిన చర్చ తారాస్థాయికి చేరుకుంది. ఈ చర్చ ఆరంభం రెండు ముఖ్య పరిణామాల నేపథ్యంలో జరిగింది. ఒకటి మండల్ కమీషన్ నివేదిక విడుదల కావటం, రెండు, ఆర్థిక సరళీకరణ విధానాలు భారత దేశంలో ప్రవేశపెట్టటం. ఈ నేపథ్యంలో చూసినప్పుడు చర్చను రాజకీయ, సామాజిక అంశాలకే కాక, రాజ్యానికి కూడా ముడిపెట్టి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

రాజ్య విధానాలని గమనిస్తే, సరళీకరణ తరువాత ఆర్థిక అభివృద్ధి, పురోగతి ప్రభుత్వ రంగం నుండి ప్రైవేటురంగ ప్రభావానికి గురయ్యే విధంగా మలచబడ్డాయి. దీని వల్ల సంక్షేమ విధానాలకి కావలసిన వనరులు సమకూర్చు కోవటం కష్టమవుతూ వచ్చింది. ఉద్యోగాల సంఖ్య, వేతనాలు పడిపోయి అసంఘటిత రంగం పెరిగి, మొత్తం మీద పేదరికం పెరగటం జరిగింది. సంక్షేమ రాజ్యం కింద అందరూ ఆమోదించిన పౌరసత్వం లేదా సమానత్వ విలువలు సరళీకరణ తరువాత దాడికి గురయినాయి.

సామాజికపరంగా చూస్తే 1990ల తరువాత అస్తిత్వ కేంద్రంగా వచ్చిన ఉద్యమాలు రెండు విషయాలని ప్రధానంగా ముందుకు తెచ్చాయి. ఒకటి, రాజ్యాన్ని పౌరసత్వం, సమానతలపై నిలదీయటం; రెండు, తమ సంఖ్యా బలానికి సరిపోయేటట్లు రాజకీయ వ్యవస్థలో, ప్రభుత్వ రంగంలో, విద్యా సంస్థల్లో, ప్రజా అవసరాలు మరియు ఇతర సముదాయ వస్తువుల(పబ్లిక్ గూడ్స్)లో వాటాలు, ప్రాతినిధ్యం కోసం డిమాండు చేయటం. మొదట్లో ఆయా అస్తిత్వ ఉద్యమాలు విలువలపరంగానూ, విషయపరంగానూ తమ రాజకీయాలపై నియంత్రణ కలిగి ఉండటంవల్ల, అనేక విజయాలు సాధించాయి. కాలక్రమేణా, నైతికంగా బలహీనపడటం వల్ల ఉద్యమాలు కూడా బలహీనపడ్డాయి.

రాజకీయ రంగంలో పరిణామాలు ఇంకో రకంగా ఉన్నాయి. అప్పటి వరకూ, రాజ్యమిచ్చిన సంక్షేమ పథకాలని నిర్లిప్తంగా తీసుకుంటూ వచ్చిన అణగారిన వర్గాలు, రాజ్యాన్ని, సామాజిక న్యాయ విలువల గురించి, తమకు రావలసిన అపారమైన ప్రయోజనాలను గురించి ప్రశ్నించటం ప్రారంభించాయి. సామాజిక న్యాయాన్ని పాలనా రంగం నుండి, రాజకీయ రంగంలోకి తేవటానికి చేసిన అనేకానేక ప్రయత్నాల ద్వారా 'చిన్న' కులాలు తమకున్న బలాన్ని చూపించుకో గలిగాయి. వనరులపై నియంత్రణ కోల్పోయిన రాజ్యం సామాజిక న్యాయాన్ని, దాని అపార పరిధిని, సంఖ్యలకు, ఎంత మందికి ఎన్ని వస్తువులు ఇచ్చాము అనే పద్ధతిలో, 'సక్రమమయిన వస్తు పంపిణీ'కి కుదించాలని చూడటం మొదలు పెట్టింది. దీని కోసం, రాజ్యానికి టార్గెట్ జనాభాని నిర్ణయించటం ముఖ్య అవసరంగా మారింది. సామాజిక న్యాయాన్ని 'లెక్కింపుల న్యాయాని'కి కుదించిన నేపథ్యంలో రాజ్య అవసరాల కోసం ఇటువంటి సంఖ్యలు బాగా అవసర మవుతున్నాయి.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు మనకి కులగణనపై జరుగుతున్న చర్చల్లో రెండు రాజకీయ ధోరణులు కనిపిస్తాయి. కులాన్ని నిర్మూలించి సమాజాన్ని ప్రజాస్వామీకరించాలనేది ఒకటయితే; రెండవది, ప్రభుత్వ పథకాలని/ప్రజావసరాల పంపిణీ వ్యవస్థని మరింత సమర్థవంతంగా తయారు చేయవచ్చనే ధోరణి. ఒక స్వచ్ఛమైన రాజకీయ ప్రక్రియలో ఈ రెండు లక్ష్యాలు కూడా ముఖ్యమైనవిగా ఉండాలి. కానీ, కులగణనపై జరుగుతున్న చర్చలో చాలా వరకూ, ప్రజావసరాల పంపిణీని మరింత సమర్థవంతంగా చెయ్యాలనే ధోరణి అంటే, సామాజిక న్యాయాన్ని కుదించే దృక్పథమే, ఎక్కువగా కనిపిస్తోంది.

మా ఉద్దేశంలో, కులగణనపై చర్చ, నైతికపరమైన ప్రజాస్వామికపరమైన పార్శ్వాలపై దృష్టి పెట్టకపోతే, రాజ్యానికి అనుకూలంగా ఉండే సంఖ్యాపరమైన సామాజికన్యాయ పరిధిలోకి వెళ్ళే ప్రమాదముంది. ఓబీసి మరియు దళిత ఉద్యమాలు, అవి కులగణన కోసం చేసే వాదనలు కూడా తమతమ కమ్యూనిటీలలో వస్తున్న వైరుధ్యాలపట్ల జాగరూకతతో వ్యవహరించాలి.

ఈ బ్రాడ్‌షీట్‌లో కులగణనపై భిన్న దృక్పథాలున్న ఆరు వ్యాసాలను ఎంచుకున్నాము.

వలసపాలనా కాలం నుండి మొదలయిన కులగణన గురించి ఒక చారిత్రక విమర్శనాత్మక దృక్పథాన్ని దుర్గం సుబ్బారావు అందిస్తారు. కులగణన తరాలబట్టి వస్తూ వున్న అగ్రకుల ఆధిపత్యాన్ని, దాని ముసుగును ఛేదించడానికి పనికొచ్చే ఆధిపత్య వ్యతిరేక సాధనమని ఆయన వాదిస్తారు. భిన్న రకాల కుల ఆధిపత్యాలను కులగణన బయటికి తెచ్చి, ఒక ప్రజాస్వామిక, సామాజిక జ్ఞానాన్ని ప్రజలకు అందించిందని ఆయన అంటారు.

వనరులపై తమకున్న పొంతన లేని ఆధిపత్యం బయటపడుతుందనే భయం వల్లే ఆధిపత్య కులాలు కులగణనను వ్యతిరేకిస్తున్నాయి అని కె.సత్యనారాయణ వాదిస్తారు.

వెనుకబడిన తరగతులకు రాజ్యాంగపరంగా లభించిన గుర్తింపుని ఆధారంగా తీసుకున్న రవివర్మకుమార్ ఓబీసిలను లెక్కించే కులగణన కావాలని వాదిస్తారు.

సామాజిక అసమానతలని ఆధారంగా తీసుకొని సోనాల్దేశాయ్ కులగణన ఒక అభ్యుదయ దృక్పథంలో చేయాలని వాదిస్తారు. కులగణన సఫలీకృతం కావటానికి అవసరమయిన పద్ధతులను, సైద్ధాంతిక పరికరాలను సూచిస్తారు.

వి.కె.నటరాజ్ కులగణనను వ్యతిరేకించటానికి రెండు ప్రతిపాదనలు చేస్తారు: కులగణన చేయటం అసాధ్యమని; రెండు, సరళీకరణ విధానాల తరువాత, కులగణన చేయటం వల్ల వచ్చే ఉపయోగం తక్కువనీ.

సతీష్ దేశ్‌పాండే మరియు మేరీజాన్ రాసిన వ్యాసం చర్చను ఒక దగ్గరకు తీసుకొచ్చి, చర్చలో ప్రధానంగా వస్తున్న భిన్న వాదనలతో ఉన్న సమస్యలని ఎత్తిచూపిస్తుంది. స్వల్పకాలిక దృక్పథంలో కులగణన, దానివల్ల వచ్చే ప్రయోజనాలను సమర్థిస్తూ, దాని సాధ్యాసాధ్యాల పట్ల ఉన్న విమర్శల గురించి వీరు మాట్లాడతారు. దీర్ఘకాలిక దృక్పథంలో కులగణనకున్న ప్రజాస్వామిక సంభావనీయత గురించి తమ ఆలోచనలను కూడా చర్చిస్తారు.

కులగణనపై ఈ బ్రాడ్‌షీట్ రెండు ముఖ్య సూత్రాలని పాఠకుల ముందు పెడుతుంది: మొదటిది, సమర్థవంతమైన వనరుల పంపిణీ జనాభా ప్రాతిపదికన జరగాలంటే, దాన్ని కులీనవర్గ ఆధిపత్యం నుండి బైటకు తేవాలి; రెండవది, దీర్ఘకాలంలో కుల నిర్మూలన జరగాలంటే, కులగణనకున్న ప్రజాస్వామిక సంభావనీయతను దృష్టిలో పెట్టుకోవాలి.

**జి. కృష్ణారెడ్డి**
**ప్రత్యేక సంపాదక బృందం తరపున**
**అనువాదం : ఎ. సునీత**

**భారతీయ సామాజిక అల్లికకు కులం ఇప్పటికీ పునాదిగా పనిచేయటమేకాక, భారతీయ సమాజంలోని వివిధ సామాజిక వర్గాలలో వస్తున్న మార్పులకు ఈ కుల వివరాలతో కూడిన రికార్డు దిక్సూచిగా వుంది.**

**- డా. బాబాసాహెబ్ బి.ఆర్.అంబేడ్కర్**

**డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు. సంకలనం-5, పేజీలు 6-7**

*పాఠకుల నుండి విమర్శలని, సూచనలని ఆహ్వానిస్తున్నాం.*
*మీ ఉత్తరాలు రాయాల్సిన అడ్రస్: సంపాదకులు, సమకాలీన రాజకీయలపై బ్రాడ్‌షీట్, అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్*
*2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాద్ - 500013. ఇ-మెయిల్ broadsheet@anveshi.org కి పంపించాలి.*
*వ్యక్తిగత ఆరోపణలు లేని, సద్విమర్శ కలిగిన ఉత్తరాలను స్పందనలను తరువాతి బ్రాడ్‌షీట్ సంచికలో ప్రచురిస్తాం.*

# కులం లెక్క తేల్చాల్సిందే

■ దుర్గం సుబ్బారావు

*"ఆ దేశంలో మత చట్టాలు, దేశ చట్టాలు, గౌరవం, హోదా....అన్నీ కలగలిసి సమైక్యమై అక్కడి పౌరుణ్ణి శాశ్వతంగా ఒకే ఒక్క విషయానికి సంబంధించిన నిబంధనలతో కట్టిపడేశాయి.....దాని పేరే కులం"*

*- ఎడ్మండ్ బర్క్*

దేశాన్ని దాదాపు 250 సంవత్సరాలుగా మెల్లమెల్లగా ఆక్రమించిన బ్రిటీషు వలసవాద పాలన తొలిదశలో కంపెనీ వ్యాపారం, తదుపరి దశలో భూమి రెవెన్యూ వసూళ్ల వ్యవస్థపై దృష్టి కేంద్రీకరించి దోపిడీ సాగించింది. గ్రామీణ సామాజిక నిర్మాణాన్ని బ్రిటీషు పాలకులు భూమి సంబంధాల్లో భాగంగానే భావించారు. గ్రామీణ సమాజాన్ని వ్యవసాయ కమతాల ఉత్పత్తి సంబంధాల ద్వారా అర్థం చేసుకోవాలనే వారు ప్రయత్నించారు. 1857 సిపాయి తిరుగుబాటు బ్రిటీషు వారి కళ్లు తెరిపించింది. కులం, మతం.... ఈ రెండు అంశాలూ, భూమితో పాటు ఇక్కడి ప్రజలపై చూపుతున్న ప్రభావం బ్రిటీషువారి దృష్టికి వచ్చింది. కుల కట్టుబాట్లు, మత ఆచార వ్యవహారాలూ, కులానికీ, మతానికీ మధ్యవున్న విడదీయరాని సంబంధంపై బ్రిటీషు, పాశ్చాత్య సోషియాలజిస్టులు, ఆంత్రోపాలజిష్టులు అధ్యయనాన్ని వేగవంతం చేశారు. ఎత్నోగ్రాఫిక్ అధ్యయనాలు పెరిగాయి.

1857 కంటే ముందు మద్రాసు ప్రొవిన్స్‌లో జిల్లా మాన్యువల్స్, గజిటీర్స్, జనాభా లెక్కలు....వంటి అంశాలు రెండు మూడుసార్లు జరిపినప్పటికీ అది తక్కువ స్థాయిలోనే జరిగింది. కానీ 1857 తరువాత తమ ఆధీనంలో వున్న ప్రాంతాల్లో (బ్రిటీషు ఇండియా) ప్రత్యేక శ్రద్ధతో జిల్లా మాన్యువల్స్, గజిటీర్స్ తయారు చేయడం ద్వారా ఆ ప్రాంతాల భూ వ్యవస్థలతో పాటు సామాజిక వ్యవస్థల గురించి కూడా క్షుణ్ణంగా తెలుసుకునే ప్రయత్నం మొదలైంది. ఇదే దేశ జనాభా లెక్కలు, అందులో కులం, మతం, ఆడ-మగ, పిల్లల-పెద్దల లెక్కలు వంటి అంశాల సేకరణకు బీజం వేసింది.

విలియం హంటర్, హెర్బర్ట్‌రిస్లే, ఎడ్గార్ థర్స్టన్, జె.హెచ్.హట్టన్‌లు కులంపై తొలిగా అధ్యయనం చేసిన సామాజిక శాస్త్రవేత్తలు. వీరే దేశంలో జనగణన/కుల గణనకు నాయకత్వం వహించిన బ్రిటీషు అధికారులు. వీరి నాయకత్వంలోనే 1871/72 నుంచి 1931 వరకు 60 సంవత్సరాల పాటు 10 సంవత్సరాల కొకసారి చొప్పున 6సార్లు కుల జనాభా గణన జరిగింది. 1871/72లో తొలిసారి దేశవ్యాప్తంగా బ్రిటీషు ఇండియాలో కులం, ఆచార వ్యవహారాలు వంటివి సేకరించారు. 1871/72, 1881- రెండు సార్లు 'వర్ణం' గురించి ఎక్కువ శ్రద్ధ వహించగా, అటు పిమ్మట 'కులం' ప్రధానంగా జనాభా లెక్కలు జరిగాయి. 'వర్ణం'లో అస్పష్టత వుండటం, ముఖ్యంగా దక్షిణ దేశాన 'క్షత్రియ' వర్ణం లేకపోవడం, తదుపరి అనేక కులాలు తమ్ము తాము క్షత్రియ వర్ణంగా పేర్కొంటూ అర్జీలుదాఖలు చేయడం, అంతేగాక కులగణనలో 'కుల హోదా' గురించి రిస్లే కాలంలో (1891, 1901, 1911) ప్రాధాన్యత ఇవ్వడంతో అనేక కులాలు తమ కులహోదా పెంచాలని అర్జీలు పెట్టుకోవడం, వివిధ కులాలు తమ కులం గొప్పదని మిగతా కులాలతో పోల్చడం వలన చెలరేగిన ఘర్షణలు, బ్రాహ్మణ కులంతో కొన్ని కులాలు ఆధిపత్య పోరుకు దిగడం.... వంటి అనేక పరిణామాత్మక అంశాలు ఆ అరవై ఏళ్లలో (1871 నుంచి 1931) జరగడంతో చివరకు 1931 తరువాత (1941 నుంచి) కులాన్ని జనాభా గణనలో చేర్చకుండా ఆపివేశారు.

జనాభా గణనలో 'కులం' వుండటం దేశ రాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికింది. వర్ణం చాటున కులాన్ని, మతం చాటున వర్ణాన్ని దాచి, ఈ దేశంలో దాదాపు వెయ్యి సంవత్సరాలు రాజకీయ అధికారం, మరో వెయ్యి సంవత్సరాలు సామాజిక అధికారం చెలాయించిన బ్రాహ్మణవర్గ (వర్ణ/కుల) అంతర్ముఖ స్వభావాన్ని కులగణన బయటకు లాగి బహిర్గతం చేసింది. దేశ జనాభాను కులాల పేరుతో 'విభజించి పాలించి' నిచ్చెన మెట్ల కులవ్యవస్థను ఏర్పరచిన బ్రాహ్మణవాదం కుటిల స్వభావం వెలుగులోకి వచ్చింది. ఇందుకు కేవలం కులజనాభా గణనే కాక సమాంతరంగా కొనసాగిన ఆంత్రోపాలజీ, సోషయాలజీ, ఆంత్రోపొమెట్రీ, ఎత్నోగ్రాఫిక్, ఫిలాలజి, ఇండాలజీ భాషా శాస్త్ర అధ్యయనాలు కూడా ఎంతగానో దోహదపడ్డాయి.

తద్వారా కులం దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావశీల అంశంగా ముందుకు వచ్చింది. పేదరికం, అణచివేత, వెలి, ఆధిక్యత, ఆధిపత్యం, సామాజిక హోదా, గౌరవాలకు మారుపేరుగా 'కులం' రోజురోజుకూ బలపడింది. తప్పో, ఒప్పో ఒక రాజకీయ అంశంగా దేశ రాజకీయాలకు కేంద్రంగా కులం మారింది. ఇందువల్లే బ్రాహ్మణవాద సోషియాలజిస్టులు ఇప్పటికీ కులాన్ని నిర్మించింది బ్రిటీషువారని నిందిస్తుంటారు. కానీ వాస్తవంలో కులాన్ని, మతాన్ని, ఆ వైరుధ్యాలనీ అత్యంత చాకచక్యంగా వాడుకొని అధికారాన్ని, దోపిడీని కొనసాగిస్తూ అటు బ్రాహ్మణ వర్గం, ఇటు బ్రిటీషు వారు..... ఇరువురూ సమానంగా లాభపడ్డారు.

'కులం' మతవ్యవస్థ, సాంఘిక, పౌర సమాజాలను శాసిస్తున్న ఒక ముఖ్యాంశంగా అప్పటి సెన్సస్ కమీషనర్ హెర్బర్ట్ రిస్లే భావించాడు. మరోవైపు 1890 నాటికే రాబర్ట్ కాల్డ్‌వెల్, డా॥గుస్టావ్ ఒపెర్ట్‌ల ద్రవిడ భాషా సిద్ధాంతం వెలుగులోకి రావడంతో రిస్లే ప్రధానంగా కులాన్ని, జాతి (రేస్)తో ముడిపెట్టి ఆర్య-ద్రావిడ.... జాతుల అధ్యయనాన్ని చేసేందుకు కుల జనాభా గణనను ఉపయోగించుకుంటూ 'కులహోదా', కులం-పని/వృత్తి, ఆచార వ్యవహారాలు వంటి అన్ని అంశాలనూ సేకరించే ప్రయత్నం చేశాడు.

కుల జనాభాగణన అనేక అంశాలను వెలుగులోకి తెచ్చింది. అందులో ముఖ్యమైనది ఈ దేశ సామాజిక వ్యవస్థపై బ్రాహ్మణ వర్గాన్నికున్న తిరుగులేని పట్టు. ఈ సమయంలోనే గౌతమ, యాజ్ఞవల్క్య, నారద ధర్మస్మృతులు, ముఖ్యంగా మనుధర్మ శాస్త్రం వెలుగులోకి వచ్చింది. స్మృతులు, సూత్రాల ఆధారంగా బ్రాహ్మణులు తమ ఆధిక్యతను స్థిరపర్చడం, చాటిచెప్పడంతో మరలా బ్రాహ్మణవాద హిందూ మతం బ్రిటీషువారి సహాయ సహకారాలతో జవజీవాలు పొంది పునర్జీవితమైంది. కుల ఆచార వ్యవహారాల సేకరణ అనేక ఎత్నోగ్రాఫిక్, ఆంత్రోపాలజీ అధ్యయనాలకు, కుల చరిత్ర, పుట్టుక, హోదా, స్థాయి, కులం-వృత్తి సంబంధం, కులం-స్వచ్ఛత (ప్యూరిటీ), పవిత్రత, అపవిత్రత, శుచి, శుభ్రత. అంటు, ముట్టు లాంటి అనేక అంశాలు, కులంలోనే వివాహాలు (ఎండోగమీ), కుల వ్యవస్థ ప్రధాన లక్షణాలైన సమాజ విభజన, నిచ్చెనమెట్ల అధికార హోదా, స్పృశ్యత-అస్పృశ్యత, కొందరికి విధులు, నిషేధాలు, కొందరికి అవకాశాలు, నచ్చిన వృత్తి ఎంచుకునే హక్కు లేకపోవడం, పెళ్లిపై నిషేధాలు.... వంటి అనేక అంశాలు సామాజిక శాస్త్రాల అధ్యయనానికి కేంద్రంగా మారేందుకు ఈ కుల గణన కూడా తోడ్పడింది.

జెండర్ (స్త్రీ-పురుష) లెక్కలు సేకరించడంతో స్త్రీల/బాలికలపై అణచివేత, వారి పట్ల వివక్షత బయటకు వచ్చాయి. ఉదాహరణకు ఉత్తర, పశ్చిమ ఇండియాలో అగ్రకులాల్లో స్త్రీల జనాభా / ఆడ పిల్లల జనాభా తక్కువగా వుండటంతో ఆడపిల్లల హత్య ఆ కులాల్లో ఎక్కువగా వుందన్న విషయం బయటకు వచ్చింది. అదే విధంగా కుల బహిష్కృతులు (అంటరాని వారు - తదుపరి కాలంలో షెడ్యూల్డు కులాలు), షెడ్యూల్డు తెగల జనాభా లెక్కలు వెలుగులోకి వచ్చాయి. మతం ఆధారంగా వచ్చిన జనాభా లెక్కల ఆధారంగా 1909లో మింటోమార్లే సంస్కరణల ద్వారా ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు, ఆ తదుపరి 1935లో షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక నియోజక వర్గాలను డా॥అంబేద్కర్ సాధించడం, మరోవైపు ద్రావిడ భాషా సిద్ధాంతం ఆధారంగా ద్రవిడవాదం పెరియార్ నాయకత్వంలో తమిళనాట ప్రారంభం కావడం, 'కులం' రాజకీయాంశంగా మారడంతో మదరాసు, బొంబే ప్రావిన్సులలో పెరియార్, డా॥అంబేద్కర్‌ల నాయకత్వంలో బ్రాహ్మణేతర ఉద్యమం, దళిత ఉద్యమం రూపుదిద్దుకోవడం గొలుసుకట్టుగా జరిగిన పరిణామాలు, కేవలం కుల జనాభా గణన మాత్రమే దీనికి దోహదపడిందని చెప్పలేం కానీ ప్రభావితం చేసిన అంశాల్లో కులగణన కూడా ఒకటి అని చెప్పవచ్చు. కులం రాజకీయ పోటీని పెంచి తద్వారా రాజకీయ సమీకరణకు మూలమవ్వడం ఈ కాలంలోనే (1871-1931) జరిగింది. ఇందుకు మినహాయింపు మహాత్మఫూలే ఆధ్వర్యంలో జరిగిన బహుజన ఉద్యమం (1848). పంజాబ్‌లో దళితుల ఆది ధర్మ ఉద్యమం, పశ్చిమ బెంగాల్ నామశూద్ర ఉద్యమం (1891) అత్యంత వేగంగా ముందుకు వచ్చినా దేశవిభజన వల్ల ఆ రెండు ఉద్యమాలూ తెరమరుగై పోయాయి.

కులగణన వలన కొత్త కులాలు వునికిలోకి వచ్చాయి. ఉదాహరణకు దక్షిణ దేశంలో ఆది ఆంధ్ర-ఆదిద్రావిడ కులాలు కొత్తగా 1922 సంవత్సరం నాటికి

రూపుదిద్దుకున్నాయి. అదే విధంగా పల్లి కులస్థులు వన్నియ కుల క్షత్రియులుగా పేరు మార్చుకున్నారు. కల్లుగీత అవలంబించే షానార్లు నాడార్లుగా పేరు మార్చుకున్నారు. అంతేగాక దేవాలయ ప్రవేశం కోసం బ్రాహ్మలతో హోదాకోసం పోటీపడటంతో దక్షిణ దేశాన అనేక చోట్ల కులఘర్షణలు జరిగాయి.

దక్షిణ భారతాన, పశ్చిమ భారతాన ముఖ్యంగా మద్రాసు, బొంబాయి ప్రావిన్సులలో 1900–20 కాలంలో కుల స్పృహ, చైతన్యాలు విపరీతంగా పెరిగాయి. హక్కుల కోసం, గౌరవం, హోదా కోసం, దేవాలయ ప్రవేశం కోసం వెనుకబడిన కులాలు, అంటరాని కులాలు డిమాండ్ చేయడం బలపడింది. విద్య, ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో బ్రాహ్మణేతరులు వెనుకబడిన విషయాలను గుర్తించాలని ఉద్యమం మొదలైంది. విద్య, ఉద్యోగ రంగాల్లో కులగణన వలన బ్రాహ్మణులే ఆయా రంగాల్లో సింహ భాగం ఆక్రమించారని బయటపడింది. దీంతో జస్టిస్ పార్టీ ప్రభుత్వం మద్రాసు ప్రావిన్సులో 1921, 1922, 1926 లో కమ్యూనల్ జీ.వో.లు జారీ చేసింది. విద్య, ఉద్యోగ రంగాల్లో కులం ప్రస్తావన మొదలైంది. రిజర్వేషన్లు ఇటు మద్రాసు ప్రావిన్సులో, అంతకు ముందే కొల్హాపూర్ సంస్థానంలో 1908లో (ఛత్రపతి సాహు మహరాజ్ ద్వారా) ప్రారంభమయ్యాయి. 1926, డిసెంబర్ 10న సర్‌పెట్టి త్యాగరాయశెట్టి, నాయకర్‌లు "నాన్-బ్రాహ్మిన్ మేనిఫెస్టో" (బ్రాహ్మణేతర ప్రణాళిక) విడుదల చేశారు.

దీంతో బ్రాహ్మణ వర్గాల్లో కలకలం మొదలైంది. హిందూ మహాసభ కులజనాభా గణన ఆపివేయాలని డిమాండ్ చేయడం మొదలు పెట్టింది. కులస్పృహ "భారత జాతీయవాదాన్ని" దెబ్బతీస్తుందన్న ఆందోళన భారత జాతీయ కాంగ్రెస్ బ్రాహ్మణ-బనియా వర్గాల్లో ప్రారంభమైంది. ఇదే విషయాన్ని బ్రాహ్మణ సోషియాలజిస్టులు జి.ఎస్.ఘురే నుంచి ఇప్పటి వరకూ ఆయన శిష్యులు తమ రచనల్లో ప్రస్తావిస్తూనే వున్నారు. కుల చైతన్య బహుజన వాదం బ్రాహ్మణ జాతీయవాదానికి పోటీగా మారడం (మహాత్మాపూలే – పెరియార్ – అంబేద్కర్ ఉద్యమాల ద్వారా) వారి కలవరపాటుకు ప్రధాన కారణం. అంటరానివారు షెడ్యూల్డు కులాలుగా, ఆదివాసీలు షెడ్యూల్డు ట్రైబ్స్‌గా ప్రత్యేక అస్తిత్వ వర్గాలుగా (కేటగిరీ) ఏర్పడటంతో గాంధీ స్వయంగా రంగంలోకి దిగాడు. భగవద్గీతతో హిందూ మతాన్ని పటిష్టం చేస్తూ ఉగ్రహిందూ, తిలక్, సావర్కార్‌లకు భిన్నంగా తేనెపూసిన కత్తిలా "వర్ణాశ్రమ ధర్మం, కర్మ సిద్ధాంతం, పునర్జన్మ, వంశపారం పర్య వృత్తి సమర్థన"ల ద్వారా దేశ

| అగ్రకులాలు | శాతం |
|---|---|
| బ్రాహ్మణులు | 3.0 |
| కాపులు | 15.2 |
| కమ్మ | 4.8 |
| కోమటి | 2.7 |
| క్షత్రియ | 1.2 |
| వెలమ | 3.0 |
| **మొత్తం** | **29.9** |
| షెడ్యూల్డు కులాలు | శాతం |
| మాదిగ | 7.3 |
| మాల | 9.7 |
| **మొత్తం** | **17.0** |
| ఇతరులు | శాతం |
| ముస్లింలు, క్రిస్టియన్‌లు తదితరులు | 7.0 |
| **మొత్తం** | **7.0** |
| వెనుకబడిన కులాలు | శాతం |
| బలిజ | 3.0 |
| బోయ / బెస్త | 0.7 |
| చాకలి | 4.2 |
| దేవాంగ | 2.1 |
| దూదేకుల | 0.4 |
| గౌండ్ల | 2.0 |
| గవర | 0.4 |
| గొల్ల | 6.3 |
| ఈడిగ | 1.0 |
| జంగం | 0.4 |
| కమ్మర / విశ్వబ్రాహ్మణ | 2.1 |
| కుమ్మరి | 0.9 |
| కుర్మ | 1.3 |
| మున్నూరుకాపు | 0.8 |
| మంగలి | 1.3 |
| ముత్రాసి | 3.3 |
| సాలె | 2.9 |
| తెలగ | 5.2 |
| ఉప్పర | 0.6 |
| వడ్డెర | 1.8 |
| ఇతరులు | 5.4 |
| **మొత్తం** | **46.1** |

జనాభాలో సగభాగం వున్న బీసీలను హిందూ మతంలోకి మరల్చేందుకు ప్రయత్నించి సఫలీకృతుడయ్యాడు. తద్వారా బీసీల వెనుకబాటుకు మతపర సమర్థన లభించింది. ఇందుకు బీసీలు "గాంధీ, కాంగ్రెస్ బీసీలకు ఏం చేశారు?" అని ప్రశ్నించాల్సి వుంది! ఈ విధంగా మహాత్మ పూలే ప్రతిపాదించిన శూద్ర (ఓబీసి), అతిశూద్ర (ఎస్సి, ఎస్టి) ఐక్య సంఘటనకు హిందూమత తాత్విక సమర్థన ద్వారా గాంధీ తెలివిగా అడ్డుకట్ట వేయగలిగాడు. మరోవైపు "హరిజనోద్యమం, దేవాలయ ప్రవేశోద్యమం" ద్వారా దళితులనూ హైందవీకరించే ఎత్తుగడలకు కూడా పాల్పడి మహాత్మాపూలే, డా॥అంబేద్కర్ సిద్ధాంత ప్రభావం ఎస్సి, బీసీలపై పడకుండా, ఎస్సి-బీసీలు కలవకుండా, రిజర్వేషన్లు బీసీలకు అందకుండా ఒక 'మహాకుట్ర'ను 1930 నాటికే రూపకల్పన చేయగలిగారు. 1939లో మద్రాసు అసెంబ్లీలో రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించే కాంగ్రెస్ నాయకుడు పి.సత్యమూర్తి "దేశాన్ని కులాల పేరుతో విభజించకూడదు" అంటూ కులజనాభా గణనను నిలిపివేయాలని డిమాండ్ చేశాడు. అటు బ్రాహ్మణవాదులు, ఇటు కాంగ్రెస్ వాదులు కూడా బీసీలు తమ పట్టునుంచి జారిపోయే ప్రమాదం గమనించి బ్రిటీషువారిపై ఒత్తిడి పెంచారు. దాంతో 1941 నుంచీ కులగణన జనాభా గణన నుంచి తొలిగించారు. దాదాపు 60 సంవత్సరాల తర్వాత మరలా 1990లో మండల్ కమిషన్ నివేదిక అమలు కావడం ఓబీసీ చైతన్యాన్ని దేశవ్యాప్తం చేసింది. దాంతో 1991 నుంచి కులగణన జనాభా గణనలో చేర్చాలన్న డిమాండ్ మొదలై 2001లో గరిష్ట స్థాయికి చేరింది. ఇపుడు 2011 జనగణన సందర్భంగా మరలా 'కులం' లెక్కలు తేల్చాలని ఓబీసీ నాయకత్వం ఉద్యమించడంతో, మరోవైపు సుప్రీం కోర్టు సూచన చేయడంతో కేంద్రం పునరాలోచనలో పడింది. మంత్రివర్గ కమిటీని ఇందుకోసం ఏర్పరచింది. బహుశా 2011 జనగణనలో కులగణన చేర్చే రోజు అతి త్వరలోనే వుంది. పరిమాణం శక్తిని పెంచుతుందన్నది సైన్స్ సూత్రం.

ఈ పరిణామం మరలా గుణాత్మక మార్పుకు దారితీసి బీసీ చైతన్యాన్ని వేగిరం చేయవచ్చు.

అది అణగారిన బహుజనులైన ఎస్సి,ఎస్టి,బీసీ మైనార్టీ ఐక్య సంఘటనను మహాత్మాపూలే – పెరియార్ – అంబేద్కర్ సిద్ధాంత భూమికతో ఏర్పరచి రాజ్యాధికార సాధనకు ప్రక్రియను వేగవంతం చేయవచ్చు.

**బహుజన కెరటాలు మే-జూన్, 2010**

## బాక్‌వర్డ్ క్లాసెస్ (వెనుకబడిన తరగతులు)

'బాక్‌వర్డ్ క్లాసెస్' అనేపదం భారత రాజ్యాంగంలో పొందుపరచలేదు. కులం, వృత్తి, పేదరికం, సామాజిక వెనుకబాటుతనం వీటి మధ్య అవినాభావ సంబంధం వుంది. భారతదేశంలో కిందికులాల వాళ్లని 'వెనుకబడిన తరగతులు' గా వ్యవహరించటం జరుగుతోంది.

భారత రాజ్యాంగంలో 'వెనుకబడిన తరగతుల ప్రజలు' అనే వ్యక్తీకరణ ఆర్టికల్ 16(4) లో, 'సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల ప్రజలు' అనేది ఆర్టికల్ 15(4) లో, 'బలహీన వర్గాల ప్రజలు' అనేది ఆర్టికల్ 46లో, 'షెడ్యూలు కులాలు' ఆర్టికల్ 341 లో, 'షెడ్యూలు తరగతులు' ఆర్టికల్ 342 లో ఉపయోగించారు.

ఆర్టికల్ 16(4)లో వ్యక్తీకరించిన 'వెనుకబడిన తరగతులు' తర్వాతికాలంలో ఇతర వెనుకబడిన కులాలు, షెడ్యూలు తరగతులు మరియు షెడ్యూలు జాతులుగా వుంది.

ఆర్టికల్ 16(4)లో వ్యక్తీకరించిన 'వెనుకబడిన' అనేది 15(4)లో వ్యక్తీకరించిన 'సామాజికంగా, విద్యాపరంగా' అనేదానికన్నా, 'ఆర్టికల్ 46'లో వ్యక్తీకరించిన దానికన్నా కూడా చాలా విస్తృత మయింది.

రిజర్వేషన్ సదుపాయాలు 'వెనుకబడిన తరగతుల'కు కూడా ఉన్నాయి. ఇందులో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు ఇంకా ఇతర వెనుకబడిన తరగతులు కూడా భాగమే. మొదటి రెండు తరగతులకి చెందిన ప్రజలకు రాజ్యాంగపరంగానే సదుపాయాలు కల్పించబడ్డాయి. ఇతర వెనుకబడిన తరగతులకి ఒక అధికారిక ప్రకటన ద్వారా సదుపాయాలు కల్పించబడ్డాయి.

# జనగణనలో కులాల్ని లెక్కిస్తే భారతదేశం కుల సమాజంగా మారిపోతుందా ?

**■ కె.సత్యనారాయణ**

2001 జనగణనలో కులాల్ని లెక్కించాలనే ప్రతిపాదన పట్ల భారతదేశం లోని కులీన వర్గాలనుంచి, ముఖ్యంగా పైకులాల మేధావి వర్గం నుండి ఎందుకింత వ్యతిరేకత, ఆందోళన ఎదురవుతున్నాయి? నా ఉద్దేశంలో ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభమైనదే; ఎందుకంటే భారతదేశం ఒక కుల సమాజంగా రూపొందుతుంది కాబట్టి. అధికారికంగా కులాన్ని జాతీయ స్థాయిలో గుర్తించటమంటే రాజ్యాంగ పరంగా (సామాజిక వైకల్యాలని కలుగచేసేదని) కులానికి ఉన్న గుర్తింపుని (అస్పృశ్యత, సామాజిక వెనుకబాటు, అత్యాచారాలు) దాటి భారత రాజ్యం ఇంకో అడుగు ముందుకు వేస్తోందన్నమాట. భారత రాజ్యాంగం కులాన్ని సామాజిక వైకల్యానికి, వివక్షకి మూలంగా గుర్తించి ఆ అసమానతలను తొలగించటానికి కొన్ని ప్రత్యేకమైన క్లాజులను పొందుపరిచింది. భారతీయ సామాజిక జీవితంలో కులాన్ని ఆక్షేపణీయమైన అంశంగా భావించి అది నెమ్మదిగా కనుమరుగవుతుందనే దృష్టి కోణమే రాజ్యాంగంలో పొందు పరచబడింది. అంటే రాజ్యాంగం భారతీయ పౌరులందర్నీ కులరహిత వ్యక్తులుగా మాత్రమే గుర్తించి వారి అనుబంధిత జీవితాలను పట్టించుకోదు. కులాలు తెచ్చే వివక్షతను, వైకల్యాన్ని నిర్మూలించాలని గట్టిగా చెప్పే రాజ్యాంగంలో సామాజిక జీవితంలో కులాల స్థాయి, స్థితిని గురించి మాత్రం చాలా అస్పష్టత గోచరిస్తుంది. కులాన్ని లెక్కపెట్టాలనే నిర్ణయం తీసుకుంటే, అది శాస్త్రీయంగా కులాలున్నాయని ఒప్పుకోవటమన్నమాట, ముఖ్యంగా వెనుకబడిన తరగతులుగా పిలవబడే కింది కులాలని న్యాయంగా రాజకీయ పాత్రధారులుగా ఒప్పుకోవటం అంటే భారతదేశాన్ని శాస్త్రీయంగా కుల సమాజమని ఒప్పుకోవటమన్న మాట. కులాన్ని ఇలా గుర్తించటం వల్ల కలిగే అనేక సామాజిక పర్యవసానాలనూ, పెనుమార్పులనూ ఊహించిన కులీన వర్గాలు అందువల్లనే ఈ నిర్ణయంతో దిగ్భ్రాంతి చెందుతున్నాయి.

అయితే భారతదేశం కుల సమాజమనేది కొత్త భావనేం కాదు. దళిత ఉద్యమంతో సహా అనేక కుల వ్యతిరేక ఉద్యమాలు భారత సమాజంలో కులానికున్న కేంద్ర స్థాయిని నొక్కి చెప్పాయి. వలసపాలనా కాలంలో జోతిబా ఫూలే, అంబేద్కర్లు కులం భారతదేశంలో వ్యక్తుల సామాజిక స్థాయిని, సంపదను, జ్ఞానాన్ని, అధికారాన్ని నిర్ణయిస్తుందని చెప్పారు. ఎమర్జన్సీ తరువాత కాలంలో వచ్చిన కొత్తతరం దళిత రచయితలు, విమర్శకులు, మేధావులు, ఉద్యమ కార్యకర్తలు ఆ విషయాన్ని వక్కాణించి చెప్పటమే కాక, కులాన్ని కొత్త రకంగా నిర్వచించారు. కులమంటే సమాజాన్ని ముక్కలుగా విడగొట్టేదన్న కులీనవర్గ నిర్వచనాన్ని త్రోసిపుచ్చి కులం రోజువారీ జీవితంలో హింసాత్మక అనుభవాలను ఇచ్చేదిగానూ, రాజకీయంగా కూడటానికి ఉపయోగపడే అస్థిత్వంగానూ నిర్వచించారు.

ఒకరకంగా, కులాన్ని జాతీయస్థాయిలో గుర్తించాలనే ఒత్తిడి 1970, 80లలో దళితులపై హత్యాకాండలకు వ్యతిరేకంగా వచ్చిన సమకాలీన దళిత ఉద్యమంతో గణనీయంగా పెరిగింది. ఈ సందర్భంలోనే చేయబడిన ఎస్.సి, ఎస్.టి అత్యాచారాల చట్టం (1989) కూడా న్యాయ(చట్ట)పరంగా కులాన్ని గుర్తించే ప్రక్రియలో ఒక ముందడుగు వేసింది. 1955లో చేయబడిన అంటరానితన నిర్మూలన చట్టం అంటరానితనాన్ని చట్టంలో గుర్తించింది కానీ కులాన్ని కాదు. 1989 చట్టం కులాన్నే అత్యాచారాలకి కారణంగా గుర్తించి ఇటువంటి నేరాలని జాతీయ నేరాలుగా పరిగణించింది. 1991 నుండి 1993 వరకూ జరిగిన మండల్ కమిషన్ చుట్టూ జరిగిన గొడవల వల్ల ఇందిరా సహానీ కేసులో కులాన్ని చట్టపరమైన విషయంగా కూడా గుర్తించింది. సామాజిక సమూహాలుగా బలపడి సమకాలీన పరిస్థితులలో శక్తిగా మారిన దళిత, ఓబీసిలే ప్రస్తుతం 2011 జనగణనలో కులాలని లెక్కించాలనే డిమాండుతో ముందుకొస్తున్నారు.

తమని తాము ప్రత్యేకంగా, అన్ని సామాజిక బంధాలకూ అతీతంగా భావించుకునే భారతీయ కులీన వర్గం (ఇంగ్లీషు విద్యనభ్యసించి, నగరాలలో నివసించే అతి చిన్న మైనారిటీ, వారి వర్గాలకి చెందిన రాజకీయ నాయకులు) కులాన్ని దేశాన్ని విభజించే 'దుష్టశక్తి' గా చూస్తుంది. ఈకోవలోకే వచ్చే ఇంకా చిన్న ఉదారవాద, వామపక్ష మేధావి వర్గం కూడా కులాన్ని లెక్కపెట్టే ప్రక్రియ భారత దేశాన్ని పూర్తి ప్రజాస్వామిక సమాజంగా మారకుండా అడ్డుకుంటుందని వాదిస్తోంది. వీరి దృష్టిలో 'కులం' అంటే కేవలం రిజర్వేషన్ల గురించో ఎస్సి, ఎస్.టి. ఓబీసీలకు సంబంధించిన విధానాల గురించో మాత్రమే. తమని తాము కులరహిత పౌరులుగా భావించుకునే వీళ్ళు మిగిలిన వాళ్ళని 'కుల కళంకితులుగా' చూస్తారు. సమాజంలో భిన్న కులాలను, భిన్న సమూహాలను గుర్తించటం వీరి దృష్టిలో ముఖ్యం కాదు. ఈ సందర్భంలో మనకు కులీన వర్గాల కుల సిద్ధాంతాల గురించి దళిత విమర్శ అవసరమవుతుంది. సాహిత్యం, అకడమిక్, రాజకీయ కార్య రంగం నుండి వచ్చిన అనేక మంది దళిత మేధావులు కులాన్ని రోజువారీ వివక్ష, క్రూరమైన హింస, అమానవీయత, అసమానతలకు పునాదిగా చూస్తున్నారు. స్వీయ అనుభవం నుంచి కూడా సిద్ధాంతీకరించే ఈ మేధావులు ఒక ప్రక్క కుల అహంకారం, సామాజిక విలువలు, అధికారం, ప్రతిష్ట కులానికెలా ముడిపడి ఉన్నయో వెలుగులోకి తెస్తూనే ఇంకో పక్క ఆధునికత లేదా లౌకిక పౌరసత్వం కులరహితమనే వాదనను బద్దలు కొడుతున్నారు. కులమంటే కింది కులాలకే ఉంటుందనీ, లేదా కులం సమాజాన్ని విడగొడుతుందనే భావనలను గట్టిగా ఎదుర్కొంటున్నారు. విస్తృత సమాజంలోనే కాక ఎన్నికల రంగంలో కూడా ఈ కులాలు కూటములుగా ఏర్పడటం అకడమిక్ రంగంలో ఉన్న వారిని విస్మయ పరుస్తున్నాయి. దళిత మేధావుల రచనల్లో కులం ఒక విమర్శనాత్మక వస్తువుగానే కాక, సామాజిక మార్పులను అర్థం చేసుకోవటానికి, అధ్యయనం చేయటానికి అవసరమయ్యే ప్రధానాంశంగా ముందుకొస్తోంది.

భారత జనగణన భారతీయతను ప్రతిబింబించే ఒక కీలక రంగం. భారత జనాభా లెక్కలు ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులపైనే కాక వార్డు, గ్రామ, పట్టణ ప్రాంతాల ప్రజల లెక్కల గురించి ప్రాథమిక సమాచారం అందించే ఒకే ఒక ఆధారం. ఈ ప్రామాణిత సమాచారం ఆధారంగానే పార్లమెంటు నుండి గ్రామస్థాయి దాకా నియోజక వర్గాల రిజర్వేషనులు పునర్వ్యవస్థీకరణ జరుగుతాయి, అయితే 1931 తరువాత ఇటువంటి నియోజక వర్గ స్థాయి కులాల లెక్కలు అందుబాటులో లేవు. జనాభా లెక్కల ద్వారా ప్రస్తుతం మత సమూహాలు, భాషా సమూహాలు, ఎస్.సి, ఎస్.టి జనాభా, స్త్రీ-పురుషుల లెక్కలు అందుబాటులో కొస్తున్నాయి. కులాన్ని కేవలం ఎస్.సి, ఎస్.టిల విషయంలో మాత్రమే నమోదు చేయటం జరుగుతోంది. మిగిలిన జనాభా కులం గురించి ఏ రికార్డూ లేదు. అంటే ప్రస్తుతం భారత జనాభా లెక్కలు 'అచ్ఛమైన (కులరహిత) భారతీయతకు' ప్రతిబింబంగా వున్నాయన్న మాట!

కుల జనాభా లెక్కలకున్న రాజకీయ ప్రాముఖ్యత నేపథ్యంలో కులాన్ని జనగణనలో చేర్చాలనే డిమాండు 2001లో ముందుకొచ్చింది. అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వం దీనిని తిరస్కరించింది. అయితే ఇప్పుడు మాత్రం అణగారిన కుల సమూహాలు జనగణన ద్వారా రూపొందుతున్న ఏకశిలాసదృశ్యమైన భారత జాతీయ చిత్రాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్య సంస్థలతో లేదా సంస్థాగత నిర్మాణాలతో పని చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన దళితులు, మిగిలిన అణగారిన వర్గాలు, కులాల లెక్కలని ఈ వ్యవస్థలో తమ సమూహాలని బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగా అడుగుతున్నారు. వాళ్ళు విప్లవం, కొత్త భూపంపిణి విధానం, పథకాలూ, కార్యక్రమాలతోపాటు జనాభా లెక్కల ద్వారా ఏర్పడే కొత్త సమూహాలని కూడా ఆహ్వానిస్తున్నారు. అయితే ఈ పెద్ద పెద్ద సామాజిక మార్పులను తెచ్చే కార్యక్రమాల కోసం వేచి చూడగలిగే విలాసవంతమైన స్థితిలో గాని, మొత్తం జనగణన కార్యక్రమాన్ని సమూలంగా మార్చే అధికారం గాని వారికి లేవు.

ఓబీసీలనే కాకుండా, జనగణనలో భాగంగా, ప్రతీ ఇంట్లో ప్రతీ సభ్యుని కులం లెక్కించే కార్యక్రమం చేపడితే, భారత దేశం కుల సమాజమని తెలియటమే కాక, కొత్త ప్రశ్నలు కూడా లేవనెత్తొచ్చు. కొన్ని కులాల పొంతనలేని ఉన్నత స్థితిని, వారికున్న సంఖ్యని జనగణన సమాచారం ఎత్తి చూపిస్తుంది. సమగ్రంగా ఉండే కుల, తెగల, ఓబీసీల సమాచారంతో రిజర్వేషన్లపై ఉన్న 50% సీలింగును ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. కొత్త కుల సమూహాలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలపైనే కాక భూమి, అధికారం, సంపద పంపకాలపై కొత్త ప్రశ్నలను లేవదీయచ్చు. అకడమిక్ చర్చలను అధిగమించి అర్థవంతమైన ప్రజా చర్చల ద్వారా కుల వ్యవస్థని నిస్సారం చేసి వేరే రకమైన కుల రాజకీయాలకు దారి తీయవచ్చు. కులాల మధ్య సంఘర్షణ, ఓబీసీలలో ఎస్సిలలో కొత్త పాలక వర్గాలు వచ్చి, ఉన్న పాలక వర్గాలని పూర్తిగా పక్కకి పెట్టవచ్చు. ఇటువంటి ప్రజాస్వామీకరణ ఎవరూ ఊహించని అనేక వైరుధ్యాలతో కూడి ఉండవచ్చు. అయితే భారత కులీన వర్గం ఇటువంటి సమూల మార్పుకు ఏ మాత్రం సంసిద్ధంగా లేదని మాత్రం గట్టిగా చెప్పొచ్చు.

**'Will India Become a Caste Society if Caste is Counted?'**

**India in Transition (online), 2nd August, 2010. Center for the Advanced Study of India, University of Pennsylvania.**

**Link: casi.sas.upenn.edu/lit satyanarayana.%27?page=3**

**అనువాదం : ఎ.సునీత**

# కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు – రాజ్యాంగం రీత్యా అవసరం

■ రవివర్మ కుమార్

గత ఐదు దశాబ్దాలుగా మన దేశంలో, కులాల వివరాలను పరిగణనలోకి తీసుకోకుండానే, జనాభాను లెక్కించడం జరిగింది. వెనుకబడిన తరగతుల నిమిత్తం స్థాపించబడిన మూడు జాతీయ స్థాయి, మరెన్నో రాష్ట్రస్థాయి సంఘాలకు, వెనుకబడిన తరగతులను గుర్తించటానికి ఈ సమాచారం ఏ విధంగానూ ఉపయోగపడలేదు. జనాభా గణన జరిగిన ప్రతిసారీ, కీలకమైన ఈ సమాచారం మరుగునపడి పోవటం వలన వెనుకబడిన తరగతులలో 70-80 శాతం ప్రజలకు అందాల్సిన సంక్షేమం అందుబాటులో ఉండడం లేదు.

జనాభా లెక్కలలో కులానికి సంబంధించిన వివరాలను మినహాయించటం అనే పద్ధతిని సమీక్షించాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది. 'కులం' అనే పదాన్ని భావవాచకంగానూ, వాస్తవమైన అర్థంలోను చెప్పుకోవచ్చు. వాస్తవమైన అర్థంలో కులం అంటే, వ్యక్తుల, కుటుంబాల సమూహం, భావవాచకంగా ఒక వృత్తిని సూచించే స్థితి. ప్రస్తుతం జనాభా లెక్కింపులో వాస్తవమైన అర్థంలోనే వాడుతున్నారు.

భారతదేశం, రాష్ట్రాల సమ్మేళనం మాత్రమే కాదు. వివిధ కులాల, సమూహాల తెగల సమ్మేళనం కూడా. భారతదేశపు రాజ్యాంగం ఆమోదించబడే నాటికి అమలులో ఉన్న కులాల, తెగల సమూహాల వ్యక్తిగత అనుశాసనాలను (పర్సనల్ చట్టాలను), గుర్తించి కొనసాగిస్తోంది. మనం, మాతృస్వామిక, పితృస్వామిక వ్యవస్థలను రెండింటినీ గుర్తిస్తాము. పుట్టుకతో ఉండే సమానత్వాన్ని గుర్తించే సమూహాలు కూడా, కాలక్రమేణా కులాల ఆధారంగా ఉండే విభజనకు సరిపోల్చదగిన పద్ధతిని అవలంబించటం మొదలు పెట్టాయి. భారత దేశంలో కులవ్యవస్థ ఒక సామాజిక విభజననేకాక, రాజకీయ, వృత్తిపరమైన విభజనలను కూడ ప్రతిబింబిస్తుంది. కాబట్టి, ప్రణాళికీకరణకు, అభివృద్ధికీ, దేశంలోని కులాలకు, తెగలకు సంబంధించిన వివరాలు సేకరించడం తప్పనిసరి. ఈ దృక్పథాన్ని ప్రభుత్వం గ్రామాలలో జరిపే సామాజిక జనాభా అధ్యయనంలో కుటుంబానికి సంబంధించిన ప్రశ్నావళి పత్రంలో గుర్తించారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రామాణికమైన "ఎవరీ శూద్రులు" అనే రచనలో ఈ విషయాన్ని ఈ విధంగా చర్చించారు. "ప్రజలకు శూద్రుల సమస్య యొక్క పరిమాణం ఎంత అని తెలియకపోవటానికి గల కారణం దేశంలో శూద్రుల జనాభా ఎంత అనే విషయం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలనే ఆసక్తి వాళ్ళకు లేకపోవడమే. దురదృష్టవశాత్తూ జనాభా లెక్కలు పెద్దగా శూద్రుల సంఖ్యను గుర్తించి చూపించవు. అంటరానివారి సంఖ్యను మినహాయిస్తే, హిందూ జనాభాలో శూద్రులు 70-80 శాతం వరకు ఉంటారనటంలో సందేహం లేదు". (అంబేద్కర్, 1946:9)

**రాజ్యాంగంలో నిబంధనలు:** 1953లో నియమించబడిన మొట్టమొదటి జాతీయ సంఘం మొదలుకొని వెనుకబడిన తరగతులను గుర్తించటం కోసం నియమించబడిన సంఘాలన్నీ, జనాభా లెక్కలలో కులానికి సంబంధించిన వివరాలు దొరకక పోవటం వలన కలుగుతున్న ఇబ్బందిని ప్రస్తావించాయి. ఈ సంఘాలన్నీ, జనాభా లెక్కలలో సమాచారాన్ని సేకరించాల్సిన అవసరం ఉందనే సూచనను బలంగా చేసాయి. ఈ సూచనలను పట్టించుకోకపోగా ఇవి ఉద్దేశపూర్వకంగా అణచివేయబడ్డాయి (కలేకర్ 1956, హవనూర్ 1975, మండల్ 1980)

రాజ్యాంగంలో 15(4) ప్రకరణను అనుసరించి సామాజికంగా, విద్య విషయంలో వెనుకబడిన తరగతుల ప్రగతికి ప్రత్యేక నిబంధనలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. దీని ఆధారంగానే వృత్తి విద్యలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. అయితే వెనుకబడిన తరగతులను గుర్తించటానికి వివిధ రాష్ట్రాల సగటు విద్యాస్థాయి కనుగొని, వీరు ఎంత మేరకు వెనుకబడ్డారో తెలుసుకోవాలంటే, ప్రతి రాష్ట్ర జనాభాలో వివిధ కులాలకు సంబంధించిన వివరాలు తెలియాలి. జనాభా లెక్కలలో తెలపాల్సిన అంశాలు, జనాభాలో: వెనుకబడిన తరగతి ప్రజల నిష్పత్తి, అక్షరాస్యత స్థాయి, ఆంగ్లభాషతో గల పరిచయ స్థాయి, ఉన్నత విద్యాభ్యాసముకలవారి నిష్పత్తి, వైద్యులు, ఇంజనీర్లు, ఇతర వృత్తులలోను ప్రభుత్వ రంగాలలో పనిచేసే వారి నిష్పత్తి మొదలైనవి. జనాభా లెక్కలు పై వివరాలతో కూడుకుని ఉన్నప్పుడే ఈ నిష్పత్తులు కనుక్కోవడం వీలుపడుతుంది. తగిన సమాచారం లేకుండా, సామాజిక విద్యా రంగాలలో ఏ కులం/తెగ స్థాయినీ నిర్ధారించటంగానీ, ఈ రంగాలలో రాష్ట్ర స్థాయి సగటుతో పోల్చి చూసి, కులాల వెనుకబాటుతనాన్ని గుర్తించడం గానీ చేయలేము.

అదే విధంగా, రాజ్యాంగంలో 16(4) ప్రకరణం ప్రకారం, రాష్ట్ర స్థాయి ఉద్యోగాలలో వెనుకబడిన తరగతులకు, ఆ ఉద్యోగాలలో వారికి 'తగినంత' ప్రాతినిధ్యం లేదని నిరూపించ గలిగినప్పుడే రిజర్వేషను వర్తిస్తుంది. 'తగినంత' అంటే రాష్ట్ర జనాభాలో ఒక కులానికి చెందిన వారి జనాభా ఏ నిష్పత్తిలో ఉంటుందో, ఆ నిష్పత్తి ప్రకారము అని అర్థము. అయితే దీనిని నిర్ధారించటానికి కూడ జనగణనలో కులాలకు సంబంధించిన వివరాలు అవసరమని తెలుస్తోంది. జనాభాలో వివిధ కులాల ప్రాతినిధ్య వివరాలు దొరకక పోవటం చేత ఇప్పటి వరకు నియమించబడిన వెనుకబడిన తరగతుల సంఘాలు, ఈ వివరాలు సంపాదించటానికి ఇతర పద్ధతులను అవలంబించాల్సి వచ్చింది. ఈ రకంగా చేయడం న్యాయస్థానాలు విమర్శకు గురిచేయటమే మాత్రమే కాకుండా, వీరు అవలంబించిన పద్ధతులను, తద్వారా చేసిన వర్గీకరణ చెల్లనివిగా ప్రకటించడం జరిగింది.

ఉదా॥రామకృష్ణ సింగ్ కేసు (ఎఐఆర్ 1960, ఎమ్‌వైఎస్ 338లో చెప్పబడిన మైసూర్ హైకోర్టు తీర్పు) ఈ అంశం నాగన్ గౌడ్ కమిటీ నియామకానికి దారి తీసింది.

వెనుకబడిన తరగతులను గుర్తించి జాబితాలను తయారు చేసిన సంఘాలన్నీ, ఈ జాబితాల నుంచి క్రమానుగతంగా(పీరియాడికల్లీ) సామాజికంగా ఎదిగిన వ్యక్తులను, సమూహాలను తొలగించి, కొత్తగా వెనుకబడిన తరగతులుగా గుర్తించదగిన వారిని గుర్తించటానికి వీలుగా వీటిని సవరించాల్సి ఉంటుందని సూచించాయి. క్రమానుగతంగా ఇటువంటి సవరణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు కూడ భావించి, ఆ మేరకు నిర్దేశించింది. ఈ ధ్యేయంతో సుప్రీం కోర్టు వెనుకబడిన తరగతులకు శాశ్వతమైన సంఘాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా నిర్దేశించింది (ఇందిరా సహానీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా, 1992 ఎస్‌సిసి (ఎల్ మరియు ఎస్. అనుబంధం)

ఈ విధమైన సవరణ చేయటానికి వెనకబడిన తరగతుల జాబితాలో చేర్చబడని కులాలన్నిటికీ సంబంధించిన సమగ్ర సమాచారం అవసరం. ఈ వివరాలు ఒక్కొక్క కులానికి సంబంధించిన జనాభా సంఖ్య, వారి విద్యాభ్యాస స్థాయి, రాష్ట్ర స్థాయి ఉద్యోగాలలో ఒక్కొక్క కులం ప్రాతినిధ్యం, సూచించాలి. ఈ సమాచారం జాతీయ స్థాయిలో పది సంవత్సరాల కొకసారి జరిగే జన గణన ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ఈ వివరాలు లేకుండా, వెనుకబడిన తరగతుల జాబితా నుంచి, ఎదుగుదల సాధ్యపడటం వలన వెనుకబాటుతనం పోయిన వారిని గుర్తించి, మినహాయించటం సాధ్యపడదు.

రాజ్యాంగంలో 81వ ప్రకరణ లోక్‌సభ కూర్పును నిర్ధారిస్తుంది. దీనికి ఒక్కొక్క రాష్ట్రానికి కేటాయించబడిన సీట్లకు, ఆ రాష్ట్ర జనాభాకు ఉన్న నిష్పత్తిని దృష్టిలో పెట్టుకోవటం జరుగుతుంది. 82వ ప్రకరణ ప్రకారం లోక్ సభలో రాష్ట్రాలకు కేటాయించిన సీట్లను మారుస్తూ, సర్దుబాటు చేయటం తప్పనిసరి. ఈ రెండు పనులూ మరియు నియోజక వర్గాలను నిర్ధారించడం, పది సంవత్సరాల కొకసారి జరిగే జనగణన ఆధారంగానే చేయడం జరుగుతుంది. ఇటువంటి నిబంధనలే రాష్ట్ర శాసన సభలకు కూడా వర్తిస్తాయి. అయితే, నియోజక వర్గాల పరిమితులను, పైన పేర్కొన్న ఇతర నిబంధనలను, రాజ్యాంగం 42వ సవరణ (1976) ద్వారా నిలిపివేసి, 2000 సంవత్సరం తరువాత జనగణన ద్వారా సేకరించిన సంబంధిత సమాచారం లభించే వరకు వాయిదా వేయడం జరిగింది.

ఇప్పుడు, 25 సంవత్సరాల తరువాత, నియోజక వర్గాల పరిమితులను, లోక్‌సభ కూర్పు, రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు, షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగలకు అనుకూలంగా సీట్ల రిజర్వేషను చేపట్టాలి. అంతే కాకుండా, మహిళలకు, వెనుకబడిన తరగతి మహిళలకు అనుకూలంగా సీట్లు రిజర్వు చేయాలనే డిమాండ్ ముందుకొస్తున్న తరుణంలో, 2001 జన గణన ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

వీటి దృష్ట్యా చూసినప్పుడు కూడ ప్రస్తుతం చేపట్టిన జనాభా లెక్కింపులో కులాల వివరాలు సేకరించే అవకాశం ఇంకా ఉందనే విషయాన్ని మరచిపోకూడదు. అంతేకాదు, ఈ వివరాలు ఇప్పుడైనా సేకరించక పోతే, మహిళలకే రిజర్వు చేయబడే నియోజక వర్గాలలో వెనుకబడిన తరగతి మహిళలకు రిజర్వేషన్ కల్పించే అవకాశాలకు శాశ్వతంగా తెరపడుతుంది.

భారత రాజ్యాంగం 243డి ప్రకరణను అనుసరించి పంచాయతీ వ్యవస్థలో బీసీలకు రిజర్వేషనుంది. అదే విధంగా 243టి ప్రకరణ ప్రకారము బీసీల గురించి తగినంత సమాచారం లేకపోయినా, మున్సిపాలిటీలలో వీరికి అనుకూలమైన రిజర్వేషను ఏర్పాటు చేయవలసి వుంది. ఈ రకంగా చేసే రిజర్వేషను సహేతుకం కాకపోయే ప్రమాదం ఉండటమే కాకుండా పక్షపాతంతో వ్యవహరించటానికి అవకాశం ఇయ్యవచ్చు. సుప్రీం కోర్టు గతంలో, వెనుకబడిన తరగతులకు చెందిన వారి వివరాలు జన గణనలో సేకరించటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతిస్తూ, అటువంటి జన గణన రాజ్యాంగ విరుద్ధంకాదని పేర్కొంది (అనుగ్రహ నారాయణ్ సింగ్ Vs యూపీ ప్రభుత్వము 1996, 6 ఎస్‌సిసి 303)

ఈ పరిస్థితులలో, 2001 జన గణనలో కులాలకు సంబంధించిన వివరాలు సేకరించడం జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఈ లెక్కింపు పైనే వెనుకబడిన తరగతులను గుర్తించడం, ఆ జాబితాలను సవరించటం, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డు కులాల తెగల సంక్షేమం, బీసీ నియోజక వర్గాలలో మహిళల రిజర్వేషను, పూర్తిగా ఆధారపడి ఉంటాయి.

**అభ్యంతరాలు, సమాధానాలు:** జనాభా లెక్కింపులో కులాల వివరాలు సేకరించటానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం (ప్రయత్నం) జరుగుతోంది. ఈ వ్యతిరేకతకు ప్రధాన ప్రాతిపదిక, ఇది సమాజంలో కులతత్వం పెరగటానికి దారి తీస్తుందన్న భావన. ఇది ఆధారంలేని భయం. గత 50 సంవత్సరాల కాలంలో కులాలకు సంబంధించిన వివరాలు సేకరించకపోవటం ద్వారా సమాజం కులరహిత సమాజంగా పరివర్తన చెందకపోగా ఈ విషయంలో సంకుచిత దృష్టిని కూడా పోగొట్టుకోలేదు. అదీగాక, కాలక్రమేణా, కులతత్వంతోపాటు మతతత్వం కూడా మన పౌర వ్యవస్థను పట్టి పీడిస్తోంది.

తరచు వ్యక్తీకరించబడుతున్న భయాలలో ఒకటి, జన గణనలో కులాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా, అనూహ్యమైన డిమాండ్లు ముందుకు వచ్చే అవకాశం ఉంది అన్నది. ఇక్కడ తలెత్తే ప్రశ్న ఏమిటంటే, ఇలా వచ్చే (లేక రావటానికి అవకాశం ఉండే) డిమాండ్లంటే భయం ఎవరికి? ఇప్పటిదాక జాతీయ సంపదపై, విద్య, మిగిలిన సేవలపై, సంపూర్ణ అధికారం ఉన్న కులాలకు చెందిన వాళ్ళకు మాత్రమే ఈ డిమాండ్లు తలయెత్తుతాయనే భయం ఉంది. నిజానికి, దేశంలోని వివిధ వనరులపై ఇటువంటి గుత్తాధిపత్యాన్ని అంతమొందించాలనే లక్ష్యంతోనే జనాభా లెక్కింపులో కులానికి సంబంధించిన వివరాలు కావాలని కోరుకోవటం. దీనికి వ్యతిరేకమైన భయాలను వ్యక్తీకరిస్తున్న వారెవరంటే, విద్యారంగంపైన, ప్రభుత్వ ఉద్యోగాలపైన ఇప్పటివరకు గుత్తాధిపత్యాన్ని కలిగి, స్వార్థ ప్రయోజనం ఉండి ఇప్పుడున్న స్థితి కొనసాగాలని కోరుకునే వారే.

రాజ్యాంగం జాతి, కుల, మత, లింగం, పుట్టిన స్థలం, వారసత్వం, భాష, నివాస స్థలము వంటి వాటి ఆధారంగా రాజ్యం చేసే వివక్షతను నిషేధిస్తుంది. రాజ్యాంగం 15,16, 29(2) ప్రకరణలలో పేర్కొన్న ఈ నిషేధాల వలన జన గణనలో కులానికి సంబంధించిన సమాచారం సేకరించటం సాధ్యపడదనే వాదన ఉంది. హవనూర్ కమిషన్ దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంది.

"రాజ్యాంగంలో 15, 16, 29(2) ప్రకరణలు రాజ్యం పౌరులను కుల, మత, లింగ, భాష, ప్రాంత, వారసత్వ, భాషల ప్రాతిపదికలపై వివక్షతను గురిచేయటాన్ని నిషేధిస్తుంది అనేది వాస్తవం. జన గణనలో కులానికి సంబంధించిన వివరాలు వివక్షతకు దారి తీస్తాయి అని చెప్పే వాదనలే, మిగిలిన అంశాలైన మతం, జాతి, లింగం, ప్రాంతం, భాష మొదలైన అంశాలకు కూడా వర్తిస్తాయి. హిందువులలో కులానికి సంబంధించిన వివరాలు సేకరించక పోవటం వివక్షత కాదా?" (హవనూర్ 1975:334) గత 50 సంవత్సరాలలో కులాల వివరాలు సేకరించక పోయినా ఆదివాసీ తెగలకు సంబంధించిన వివరాలు, రాజ్యాంగం 341, 342 ప్రకరణలో పేర్కొనబడిన కులాలకు సంబంధించినవి సేకరిస్తూనే ఉన్నారు. కర్ణాటక రాష్ట్రం ఒక్కదానిలోనే షెడ్యూల్డు తెగలుగా గుర్తించబడేవి 49 ఉన్నాయి. జనాభా వివరాలకు సంబంధించిన అంశాలలో, అన్ని కులాలకు, తెగలకు ఒకే ప్రమాణాలు వర్తించాలి. హిందువుల జనాభా లెక్కింపులో కుల వివరాలు సేకరించటం గర్హించదగిన విషయమైతే షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల విషయంలో కూడ అది వర్తించాలి. జనాభా లెక్కింపులో సమాచార సేకరణలో ఎటువంటి వివక్షతకు చోటు లేదు. షెడ్యూల్డు కులాల, తెగలకు సంబంధించిన అన్ని వివరాలు సేకరించటం మిగిలిన కులాల వివరాలు సేకరించక పోవటం రాజ్యాంగం 14,15,16 ప్రకరణలు ఇచ్చే సమానత్వ హామీలను ఉల్లంఘించటం ద్వారా వివక్షతకు పాల్పడటమే అవుతుంది.

అణచివేతకు, దోపిడీకి పాల్పడే కులాలను వ్యవస్థీకరించి, ప్రోత్సహించటం కులతత్వానికి నగ్నమైన ఉదాహరణ. దీనిని ఖండించటం, న్యాయబద్ధంగా ఆలోచించగల వారందరు చేయాల్సిన పని. సామాజిక శాస్త్రవేత్తలు దీనిని వ్యతిరేకించటం సరైనదే. అణచివేతకు, దోపిడీకి గురైన వర్గాల వారు సంఘటితం కావటం కార్మిక సంఘాల కార్యకలాపం లాగ న్యాయ సమ్మతమైనదే. వీరికి, జన గణన ద్వారా అణచివేతకు గురైన వారి సంఖ్య, ఇతర వివరాలు ప్రకటించబడాలి అని కోరుకునే హక్కుంది.

**'Caste Enumeration in Census: Constitutional Imperative'**

***EPW* August 26--Sept 2 2000, pp 3100-102**

**సంక్షిప్తానువాదం: పి.మాధవి**

చాతుర్వర్ణ ధర్మం మీద ఆధారపడిన హిందూ సామాజిక వ్యవస్థ తన దైవత్వ మూలాలను స్థిరపరుస్తూ, తన అధికార స్వభావాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య మరియు శూద్రులుగా నిచ్చెనమెట్ల సమాజంగా స్థిరీకరించింది. కాలక్రమంలో ఐదో కులంగా 'పంచములు' పేరుతో సృష్టించబడ్డ సమూహం వివిధ పేర్లతో మ్లేచ్ఛులు, అతిశూద్రులు, అవర్ణులు, అంత్యజ, ఛండాల, నిషాద, పరియ మొదలైన వాటిగా రూపాంతరం చెందింది.

19వ శతాబ్దం చివరి భాగం 'అతిశూద్రుల' సామాజిక, రాజకీయ పరిస్థితులలో ఒక కొత్త చైతన్యాన్ని తీసుకువచ్చింది.

తమ సామాజిక-ఆర్థిక పరిస్థితులను బాగుపరచటానికి వివిధ సంఘాల ద్వారా సామాజిక వివక్షతతో కూడిన పరిస్థితులను ప్రశ్నిస్తూ ఆత్మగౌరవం, మానవ విలువలతో కూడిన జీవితం కోసం పౌర, రాజకీయ హక్కులను డిమాండ్ చేశారు.

19వ శతాబ్దంలో జరిగిన జనగణన కాలం నుంచీ, 'అతిశూద్ర' కులాలు తమ కులాల పేర్ల మార్పు కోసం అడుగుతూనేవున్నారు. బెంగాలీ ఛండాలురు తమకులం పేరును 'నామశూద్రులు'గా మార్చాలని డిమాండ్ చేశారు. మద్రాసు ప్రెసిడెన్సీలోని 'పరియా'లు 'ఆది-ద్రవిడ' గా, 'ఆది-ఆంధ్ర', 'ఆది-కర్ణాటక' గా మార్పు చేసుకున్నారు. ఉత్తర ప్రావిన్స్‌లోని 'ఛమార్', 'రామదాసియ', 'రాయ్‌దాసియ' లు 'ఆది-ధర్మి', ఆది-హిందూ' గా మార్పు తీసుకున్నారు.

సామాజిక వివక్షతకు ముఖ్యంగా మూలకారణమైన అంటరానితనం, అంటరానివాళ్ళుగా వివక్షతకు గురవుతున్న ఈ సమూహాలన్నిటినీ కలిపివుంచే సామాజిక-ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వలస ప్రభుత్వం వీరందరికి వర్తించే పేరు గురించి ఆలోచన మొదలెట్టింది. ఈ వెతుకులాటలో వివిధ వ్యక్తీకరణలు ముందుకు వచ్చాయి. ' పీడిత వర్గాలు', 'అణగారిన వర్గాలు' లేదా 'వెనుకబడిన వర్గాలు' గా బ్రిటిష్ ఇండియాలోనూ, రాచరిక సంస్థానాల్లోను ప్రచారంలోకి వచ్చాయి.

# కులం, జనగణన: ముందు చూపుతో ఆలోచిద్దాం!

■ సొనాల్దే దేశాయి

జనగణనలో కులాల లెక్కింపుని వ్యతిరేకించేవాళ్ళు, అసమానతలు తొలగించాలనుకునే సమాజంలో ఇది తిరోగమనవాదమనీ, దానివల్ల కులపరమైన విభజనలు పటిష్టమవుతాయి తప్ప, నిర్మూలించబడవనీ వాదిస్తారు. ముఖాముఖి సామాజిక సంబంధాల నుంచి ముందడుగు వేసి ఊహాజనిత జాతీయ సమూహాలను సృష్టించటంలో జనగణన ప్రముఖ పాత్ర పోషించిందనే బెనెడిక్ట్ ఆండర్సన్ వాదన తీసుకున్న చాలా మంది మేధావులు, మనదేశంలో వలసపాలనా కాలం నాటి జనాభా లెక్కలు కూడా కులాలని లెక్కబెట్టిన సమూహాలుగా రూపొందించి, అప్పటి వరకూ మారుతూ వచ్చిన కుల అస్థిత్వాలని స్థిరపరిచాయని బలంగా వాదించారు. సామాజిక వ్యత్యాసాలను ఈ రకంగా స్థిరీకరించటం పట్ల వ్యక్తమయ్యే వ్యతిరేకత, కులాల గురించిన ప్రామాణిత సమాచారాన్ని సేకరించటం పట్ల వ్యతిరేకతగా ముందుకొస్తోంది. వేరే సమాజాల్లో జాతిపరమైన గణాంకాల సేకరణను వ్యతిరేకించే ధోరణి కూడా ఈ కోవలోనిదే.

ఆధునిక భారత దేశంలో ఇటీవల కాలంలో కులపరమైన అసమానతల గురించి పెద్ద ఎత్తున పరిశోధనలు జరిగాయి. ఆదాయం, జీవన ప్రమాణం, విద్య, ఆరోగ్యం, ఉద్యోగఅవకాశాలు వంటి (మనిషి జీవితానికవసరమయ్యే) అనేక కోణాల నుండి సమాచారం అందుబాటులోకి వచ్చింది. మనం ఈ అసమానతలను కేవలం ఊహాజనితంగా కాక, సామాజిక ప్రక్రియను ప్రతిబింబింప చేసేవిగా భావించి, వాటికి ప్రభుత్వ విధానాలు అవసరమని అనుకుంటే, కులాల్ని లెక్కించటం తప్పనిసరవుతుంది. అయితే చెప్పటం సులభమైనా, కులాన్ని లెక్కించటానికి సరైన ప్రామాణిక పరికరాలని (device) ప్రణాళికలని రూపొందించుకోవటం చాలా కష్టం. కులగణాంక సేకరణ, దాని అవసరం / ఉద్దేశం పట్ల స్పష్టత లోపించటం లేదా అవగాహన లేకపోవటం వల్లే అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**కుల సమాచార సేకరణ ఎందుకు?**

ఈ మధ్య కాలంలో, కులగణన చేయాలనే డిమాండు ఒక బలమైన ఓబీసి లాబీనుండి రావడానికి కారణం, తమ జనాభా పెరిగినట్లు ఋజువయితే తమకు రావాల్సిన రిజర్వేషన్లు కూడా పెరగవచ్చనే ఊహ. మండల్ కమిషన్ అంచనా ప్రకారం, ఓబీసిలు జనాభాలో 52 శాతం ఉన్నా, అన్ని కుటుంబాలూ పేదరికం, వెనుకబాటు తనంలో ఉండవు కనుక, వాటిలో సగానికి అంటే 27 శాతానికి రిజర్వేషన్లు కల్పించటం సమంజసమే. అయితే జనాభాలో 52 శాతం ఓబీసిలు వున్నారనే కమిషన్ అంచనా సరైనదయితే, అంతకంటే ఎక్కువ మందికి ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండు మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుంది.

నేషనల్ శాంపిల్ సర్వే సేకరించిన సమాచారం ప్రకారం 1999-2000లో 36 శాతం మరియు 2004-2005లో 41 శాతం వ్యక్తులు తమని తాము ఓబీసిలుగా చెప్పుకున్నారు. అందువల్ల ఈ సంఖ్య 52 శాతం దాటే అవకాశాలు తక్కువే.

అయితే దీనికంటే తక్కువ పక్షపాత ధోరణితో కులగణనను సమర్థించే వాదనలు కూడా ఉన్నాయి. భారతదేశంలో ఇప్పటికీ కూడా వ్యక్తుల సామాజిక హోదా వారి సామాజిక నేపథ్యంపై ఆధారపడి వుంటోంది కనుక బలహీన వర్గాల పట్ల ప్రభుత్వం ఎక్కువ అనుకూలతతో వ్యవహరించాలనే డిమాండ్లు కూడా వస్తూనే వున్నాయి. దురదృష్టవశాత్తూ, సరైన సమాచారం లేకపోవటంతో ఇటువంటి అభ్యర్థనలను ప్రక్కన పెట్టటం జరుగుతోంది.

అందుబాటులో ఉన్న ప్రామాణిత సమాచారం ప్రకారం వివిధ సామాజిక-మత సమూహాల మధ్య విద్య, ఆదాయం, జీవన ప్రమాణాల్లో వ్యత్యాసాలున్నాయి. భారత మానవ అభివృద్ధి సూచిక కూడా వివిధ సమూహాల మధ్య అంతరాలని చూపిస్తుంది. ఇది ఒక్కటే కాక, నేషనల్ సాంపిల్ సర్వేలాంటి అనేక సర్వేలు ఎస్.సిలు, ఎస్.టిలు, ఓబీసిలకు ఫార్వర్డ్ కులాలకి మధ్య అంతరాలని ఎత్తి చూపుతూనే వున్నాయి. అయితే ఈ గణాంకాలలో పథకాల రూపకల్పనకు సరిపోయేంత సమాచారం లేదు.

సర్వే డేటాలో రెండు ముఖ్యమైన లోపాలున్నాయి. ఒకటి, ఎన్.ఎస్.ఎస్ లాంటి విస్తృత సర్వేలలో కూడా చాలా రకాల వెనుకబాటు తనాలను పోల్చటానికి వారు పరిశోధన కోసం తీసుకునే ప్రజల శాంపుల్ చాలా చిన్నది. ఉదాహరణకు దళిత క్రైస్తవులు, దళితుల్లాగా వెనకబడి వున్నారా లేదా, క్రైస్తవుల స్థాయికి చేరుకున్నారా అనేది ఈ సర్వేలబట్టి నిర్ణయించటం సమస్యాత్మకం. ఎందుకంటే సర్వేలలో తీసుకునే దళిత క్రైస్తవుల సంఖ్య చాలా తక్కువ. ముస్లింలు, ఓబీసిలకు ప్రత్యేక అవకాశాలు కల్పించే విధాన రూపకల్పనకు ప్రయత్నించే వారు కూడా ఇటువంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. ఇటువంటి చిన్న సమూహాలపై సరైన సమాచారాన్ని సేకరించటానికి జాతీయ స్థాయిలో జనగణనే సరైన మార్గం.

రిజర్వేషన్ల విధానాన్ని సరిగా పునర్నిర్వచించే దిశగా పనిచేస్తున్న వారు కూడా ప్రస్తుత పరిస్థితుల గురించి తగినంత ప్రామాణిక సమాచారం (డేటా) దొరక్క

## భారతదేశంలో జనగణన చరిత్ర/వరుస క్రమం

**స్వాతంత్ర్యానికి పూర్వం**

1842- అలహాబాద్ పట్టణ జనగణన

1827-28 బెనారస్ నగర జనగణన

1827-28 పూర్తి అయిన ఢాకా పట్టణ జనగణన

1836-37 సెయింట్ జార్జ్ ప్రెసిడెన్సీ జనగణన

1849-స్థానిక జనాభాలో ప్రతి ఐదు సంవత్సరాలకు వచ్చే మార్పుల వివరాలు

1851-52, 1856-57, 1861-62, 1866-67 : మద్రాసు ప్రెసిడెన్సీలో క్రమానుగతంగా చేపట్టే జనాభా వివరాలు

1852 మరియు 1865 -పశ్చిమ ఈశాన్య ప్రావిన్స్‌లో జనగణన

1867-సెంట్రల్ ప్రావిన్స్‌లో జనగణన

1867- బెరార్ జనగణన

1855 మరియు 1868- పంజాబ్ టెరిటరీ జనగణన

1869- ఔధ్ జనగణన

1863- మద్రాస్ నగర జనగణన

1864- బొంబాయి నగర జనగణన

1866-కలకత్తా నగర జనగణన

1872-హౌస్ రిజిస్ట్రార్ జనగణన

1881-కాశ్మీర్ తప్ప మిగతా మొత్తం బ్రిటిష్ పాలనలోని భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఆధునిక క్రమపద్ధతిలో చేసిన జనగణన

1891-2వ జనగణన

1901-3వ జనగణన-విస్తృత స్థాయి విశ్లేషణతో కులవృత్తుల వివరాలు

1911-4వ జనగణన-క్రిస్టియన్ల జనగణన

1921-5వ జనగణన - కులం, తెగలు, జాతుల వివరాలు

1931-6వ జనగణన-అణగారిన వర్గాలు, భాష, మతం మరియు వయసు నిర్ధారణ

1941-7వ జనగణన-అక్షరాస్యత

**స్వాతంత్ర్యానంతర కాలం**

1951-8వ జనగణన - జనాభా వివరాల అంచనా

1961-9వ జనగణన - ఎత్నోగ్రాఫిక్ సర్వే

1971-10వ జనగణన -గ్రామీణ, పట్టణ ప్రాంతాలు

1981-11వ జనగణన-ప్రాథమిక సదుపాయాలు

1991-12వ జనగణన-గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, మతం, మాతృభాష

2001-13వ జనగణన-వ్యవస్థాపరమైన సదుపాయాలు, కులాల, తెగల పేర్లు

2011-14వ జనగణన

ఇబ్బందులు పడుతున్నారు. 1931లో చేసిన జనగణన సమాచారం(చాలా మేరకు) ఆధారంగా కులాలను ఎస్.సి, ఎస్టిలు లేదా ఓబీసీలుగా వర్గీకరించటం జరిగింది. ముఖ్యంగా రిజర్వేషన్ల విధానం అమలు చేయటం మొదలుపెట్టిన సమయంలో ఇటువంటి సమాచారం ఆధారంగానే వర్గీకరణ చేసారు. అయితే ఈ సమాచారం పాతబడి పోయింది. ఒకసారి ఈ రకంగా గుర్తింపబడిన కులం తేలిగ్గా ఆ స్టేటస్‌ను కోల్పోదు కాబట్టి తర్వాత ఆయా సమూహాల్లో జరిగిన ఆర్థికాభివృద్ధి ఇప్పటికీ రికార్డు కాలేదు. వెనకబాటుతనం ఎక్కడైతే వివక్షకు, సామాజిక వివక్షకు, దూరానికి ముడిపడి వుందో అంటే ఆదివాసీలకు లేదా దళితులకు, ఆ సందర్భాల్లో ఆర్థిక పురోగతిని రికార్డు చేయటం అంత ముఖ్యం కాదు. మధ్య తరగతి దళితులు, ఆదివాసీలూ కూడా ఇటువంటి సామాజిక వివక్షకు గురవుతూనే వున్నారు. వివక్ష వెనుకబాటుతనం కారణంగా కాకుండా, విద్య, ఉత్పాదక రంగాలకు దూరంగా ఉన్న కారణంగా అంటే, ఓబీసి కులాల విషయంలో, పరిస్థితులు మారుతూ వస్తున్నాయి. కొన్ని ఓబీసీ సమూహాలు చాలాఆర్థికంగా వెనుకబడి వుండచ్చు, మరికొన్ని ఫార్వర్డ్ కులాలతో సమాన స్థాయికి చేరుండొచ్చు. మనకున్న సమాచారం ప్రకారం, చాలా వరకు ఓబీసీ కుటుంబాల్లో, కనీసం ఒక్కరైనా గ్రాడ్యుయేట్ అయి వుంటారు, నెలసరి వేతనం వచ్చే ఉద్యోగాలలో చేరే అవకాశాలు కలిగి వుంటారు మరియు ఫ్లష్ టాయిలెట్లు కూడా వారి ఇళ్లలో ఉన్నాయి.

రాయితీలు పొందక్కర్లేని కులాలని చేర్చటం ఎంత సమస్యాత్మకమో, ఆ రాయితీలు పొందవల్సిన వారిని చేర్చకపోవటం కూడా అంతే సమస్యాత్మకం. సరైన ప్రామాణిత సమాచారం మాత్రమే ఆధునిక భారత దేశంలో కులాల మధ్య అంతరాలు, ఒకే కులంలో అంతరాలనుకున్న వివిధ పార్శ్వాలని అర్థం చేసుకోవటానికి, సరైన జవాబులు ఇవ్వటానికి ఉపయోగపడుతుంది. కులాల మధ్య అంతరాలు ఎక్కువున్నట్లయితే కుల ఆధారిత రిజర్వేషన్ల కోసం, ప్రస్థుతమున్న రిజర్వేషన్ కేటగిరీలను మరలా వర్గీకరించటం కోసం వున్న డిమాండ్లు బలోపేతమవుతాయి.

కులపరమైన సమాచారం సేకరించేటప్పుడు చిన్న సంఖ్యల్లో వున్న వెనుకబడిన కులాలను సరిగ్గా గుర్తించాల్సిన అవసరం చాలా వుంది. అందరి కుల సమాచారాన్నీ సేకరించాలి. 2001 జనగణనప్పుడు జనాభా లెక్కలు సేకరించే వారికి ఎస్‌సిలలో వున్న ఉపకులాల పేర్లు తెలియక పోవటం వల్ల అనేక సమస్యలెదురయినాయి. అదే సమస్య ఓబీసీలను లెక్కించాలంటే మరింత పెద్ద ఎత్తున ఎదురవుతుంది. పూర్తి స్థాయి కుల జనగణనకై ఎటువంటి నమూనా తయారు చేయాలి? ఇంత వరకు వాడిన పద్దతి ప్రకారం, ఎస్.సి, ఎస్.టిల జాబితాల్లో ఉండే కులాలు, తెగలతో, వ్యక్తులను గుర్తించి, చేర్చడం జరుగుతున్నది. మరో పద్ధతి ప్రకారంగా, కుటుంబాలు పూర్తి స్థాయి వివరాలు ఇస్తే, వాటిని గణనాధికారి పూర్తిగా వ్రాసుకుని, ఆ తర్వాత సమాచారాన్ని క్రోడీకరించటం జరుగుతుంది. ఈ రెండు పద్ధతులు కూడా కష్టపూరితమే. రెండో పద్ధతి బాగా జరగాలంటే సమగ్ర కులజాబితాలతో ప్రారంభించాల్సి వుంటుంది. అయితే ఇంత వరకు జనాభా మొత్తానికి కుల జాబితాలు లేవు. దీనిని పూరించటానికి పారిశ్రామిక క్రోడీకరణ వ్యవస్థల కోసం ఉపయోగించే పద్దతిని కులజనగణన కోసం వాడొచ్చు. ముందుగా దేశ వ్యాప్తంగా వుండే జాతుల జాబితాను తయారుచేయాలి. ఇవి నేషనల్ శాంపిల్ సర్వే, నేషనల్ ఫామిలి హెల్త్ సర్వే ఇంకా ఇతర ప్రభుత్వ సర్వేల సహాయంతో చేయాలి. కులం పేరు సరిగా రావటానికి, మిగతా జవాబులు వక్రీకరింపబడకుండా వుండడానికి, కులానికి సంబంధించిన ప్రశ్న చివరిగా అడగాలి.

ఈ (జాతుల) జాబితాను వివాహవేదికల అడ్వర్టైజ్‌మెంట్స్, కుల సంస్థల లాంటి ఇతర సూచిక/ఆధారాల సహాయంతో విస్తృతపరచవచ్చును. ఈ జాబితాను 1931 జనగణన ద్వారా మనకు లభించిన కుల జాబితాలతో చేర్చి ఒక సమగ్ర మహా జాబితా తయారు చేయాలి.

వృత్తిపరమైన క్లాసిఫికేషన్ (విభజనలో)లో విస్తృత కులాల్లో ఉపకులాలు చేర్చేట్టుగా లెక్కలు సేకరించేవారికి తమ దగ్గరున్న జాబితాల్లో లేని కులాలను కూడా చేర్చేందుకు కావలసిన చోటు కల్పించాలి.

రెండు విషయాలను కుల వర్గీకరణలో గుర్తించాలి. ఒకటి మతాలకు అతీతంగా కులాలను గుర్తించి, ముస్లిం ఓబీసిల గురించి (లేదా క్రైస్తవ బ్రాహ్మణల గురించి) కావలసిన సమాచారాన్ని సేకరించాలి. రెండు, జిల్లాలకు సంబంధించిన ప్రత్యేక కుల జాబితాలకై నివాస స్థలాలు, ఇళ్ల గురించి సమాచారం తీసుకోవాలి.

ఈ కుల వర్గీకరణ జిల్లా వారీగా చేయడానికి, అధికారులకు రెండు జాబితాలివ్వాలి. ప్రతి జిల్లాలో సాధారణంగా వుండే ఒక వందకులాల జాబితా ఒకటి, దేశమంతటా వుండే అన్ని కులాల జాబితా మరొకటి. చాలా ప్రాంతాల్లో, కులాలు, గిరిజనులు ఒకే భౌగోళిక సమూహాలుగా వుండటం వల్ల, 80 శాతం సమాచారం జిల్లా వారీ కుల, గిరిజన జాబితాలకే పరిమితం కావచ్చును. ఉదాహరణకు 'గరాసియాలు' గుజరాత్, రాజస్థాన్‌లో ఎక్కువగా, చాలా అరుదుగా పశ్చిమ బెంగాల్‌లో కనబడతారు. ఈ రకమైన జాబితాలు తయారు చేసిన తరువాత దేశవ్యాప్తంగా తయారుచేసిన సమగ్ర నమూనాతో కలిపి పరీక్షించి ఉపయోగించాలి.

**'Caste and Census: A Forward Looking Strategy'**
***EPW* July 17, 2010 Vol XLV, No.29 pp 10-13**
సంక్షిప్తానువాదం: రమామెల్కోటే

## స్వాతంత్రానంతరం రాష్ట్రస్థాయి బాక్‌వర్డ్‌క్లాస్ కమీషన్లు

| వరుస సంఖ్య | రాష్ట్రం పేరు | సం॥ | కమిటీ/కమిషన్ |
|---|---|---|---|
| 1 | ఆంధ్రప్రదేశ్ | 1968 | మనోహర్ పర్‌షద్ కమిషన్ |
| | | 1975 | వీరప్ప కమిటి |
| | | 1982 | మురళీధర్‌రావు కమిషన్ |
| 2 | బీహార్ | 1951 | బీహార్ ప్రభుత్వం |
| | | 1971 | ముంగారిలాల్ కమిషన్ |
| | | 1978 | కర్పూరి థాకూర్ కమిషన్ |
| | | 1994 | యు.ఎన్.సిన్హా కమిషన్ |
| 3 | గుజరాత్ | 1972 | ఎ.ఆర్.బక్షి కమిషన్ |
| | | 1981 | సి.వి.రానె కమిషన్ |
| | | 1987 | ఆర్.సి.మంకడ్ కమిషన్ |
| 4 | హర్యానా | 1991 | గుర్నామ్ సింగ్ కమిషన్ |
| 5 | హిమాచల్‌ప్రదేశ్ | 1951 | హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం |
| | | 1970 | హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం |
| | | 1993 | హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం |
| 6 | జమ్మూ కాశ్మీర్ | 1967 | పి.బి.గజేంద్రగడ్కర్ కమిషన్ |
| | | 1969 | జె.ఎన్.వాజిర్ కమిటి |
| 7 | కర్నాటక | 1918 | సర్ ఎల్.సి.మిల్లర్ కమిటి |
| | | 1961 | నాగన్‌గౌడ కమిటి |
| | | 1975 | హవనూర్ కమిషన్ |
| | | 1985 | వెంకటస్వామి కమిషన్ |
| | | 1990 | చిన్నప్పరెడ్డి కమిషన్ |
| 8. | కేరళ | 1961 | విశ్వనాథన్ కమిటి |
| | | 1965 | జి. కుమారపిళ్లై కమిషన్ |
| | | 1970 | యమ్.పి.దామోదరన్ కమిషన్ |
| 9. | మధ్యప్రదేశ్ | 1980 | రాంజీమహాజన్ కమిషన్ |
| | | 1984 | మధ్యప్రదేశ్ ప్రభుత్వం |
| 10. | మహారాష్ట్ర | 1961 | బి.డి.దేశ్‌ముఖ్ కమిటి |
| 11. | పంజాబ్ | 1951 | పంజాబ్ ప్రభుత్వం |
| | | 1965 | బ్రిష్‌భన్ కమిటి |
| | | 1975 | హర్‌చరణ్ సింగ్ కమిషన్ |
| 12. | తమిళనాడు | 1885 | ప్రొవిన్షియల్ ప్రభుత్వం |
| | | 1927 | కమ్యూనల్ గవర్నమెంట్‌ఆర్డర్ ఆఫ్ 1927 |
| | | 1969 | ఎ.ఎన్. సత్తనాథన్ కమిషన్ |
| | | 1982 | జె.ఎ.అంబాశంకర్ కమిషన్ |
| 13. | ఉత్తరప్రదేశ్ | 1975 | ఛేడీలాల్ సాథి కమిషన్ |

# జనాభా లెక్కల్లో కులగణన ఎందుకు ఉండకూడదు?

■ వి.కె.నటరాజ్

సతీష్ దేశ్‌పాండే మరియు మేరీజాన్ రాసిన వ్యాసం "కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు", ఇంకా ఇపిడబ్ల్యు సంపాదకీయం "కుల గణనలు ఎందుకు అవసరం" అన్న రెండు రచనలతో నాకున్న విభేదాలను క్లుప్తంగా ఇక్కడ వివరిస్తాను. రెండు వ్యాసాలూ కూడా కులానికి సంబంధించిన వివరాలను జనాభా లెక్కలలో చేర్చాలనే వాదనను చాలా బలంగా సమర్ధించాయి.

ఖచ్చితమైన గణాంకాలు చాలా అవసరమనే ఈ వాదనను మనం ఈ మధ్య కాలంలో దేశ రాజకీయ, ఆర్థిక రంగాలలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో బేరీజు వేయాలి. (అసలు ఖచ్చితమైన స్పష్టమైన గణాంకాలు అనేవి ఎంత వరకు సాధ్యం అనే విషయాన్ని వ్యాసంలో ముందు ముందు పరిశీలిద్దాం) ప్రస్తుతం రాజ్య యంత్రాంగం పలు అభివృద్ధి రంగాలలో నుండి క్రమేణా వైదొలుగుతున్నది – వీటిలో తన పాత్రని, ప్రమేయాన్ని క్రమంగా కుదించేస్తోంది. దీని ఫలితంగా రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రజలకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలిపించటంలో అందరి కంటే ముందున్న రాజ్య యంత్రాంగం నేడు ఆ హోదాని కోల్పోయింది. అందువల్ల రాజ్యాంగ పరిభాషలో ఆర్టికల్ 15(4)లో వివరించినట్లుగా "సామాజికంగా మరియు విద్యా అవకాశాలలో వెనకబడి ఉన్న పౌరుల" సంఖ్యను గాని, లేక 16(4) అధికరణలో చెప్పినటువంటి "ప్రభుత్వ రంగంలో తగినంత ప్రాతినిధ్యం లేని వెనకబడిన వర్గాలకి చెందిన పౌరులను" గాని లెక్కించటం వల్ల మనకి ఇప్పుడు ప్రత్యేకంగా ఒరిగేది ఏమీ లేదు.

ఇది వరలో అంటే ప్రభుత్వ రంగం విద్యా–ఉద్యోగావకాశాలు కల్పించటంలో అగ్రగామిగా ఉన్న రోజులలో ఇప్పుడు తలపెట్టిన ఈ కుల గణన కార్యక్రమం ఎంతో సబబుగా, ఉపయోగంగా ఉండేది. అయితే విద్యా, ఉద్యోగ రంగాలు రెంటిని నేడు రాజ్యం ఎంతో ఉత్సాహంగా, ఉద్దేశపూర్వకంగా త్యజించింది. నిజానికి 90వ దశకం మొదట్లో అధికారికంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలలోని కీలకమైన అంశం, పలు రంగాలలో రాజ్యం నిర్వహించే బాధ్యతలనీ, పాత్రనీ గణనీయంగా తగ్గించటం/కుదించటమే. కుల గణనను సమర్థించే వారు ఎవరూ ప్రభుత్వ కార్యక్రమాల జాబితాను నామ మాత్రం గానైనా ప్రస్తావించకపోవడం ఇక్కడ గమనార్హం. అంతేకాక ప్రభుత్వ ఆహార పంపిణీ (పిడిఎస్) వ్యవస్థల వంటి పలు ముఖ్యమైన కార్యక్రమాలను పేదవారందరికి (అంటే కుల ప్రాతిపదిక మీద కాకుండా) సమానంగా అందుబాటులో ఉంచాలనే వాదన ఎప్పటినుంచో బలంగా ప్రస్తావించటం జరిగింది. ఈ సందర్భంలో కులానికి సంబంధించిన లెక్కలు పాలసీల రూపకల్పనలో గాని, అవి అమలు చేయటంలో గాని ఏ విధంగా తోడ్పడుతాయో స్పష్టంగా మనకి బోధపడటం లేదు.

ఒకప్పుడు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో రిజర్వేషన్లు ఇంజనీరింగ్, వైద్య, తదితర కోర్సులలో ఓబీసీలకి ప్రవేశం కల్పించటంలో కీలకమైన పాత్ర పోషించాయి. అయితే నేడు కాలేజీల, తద్వారా సీట్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, అభ్యర్థుల కంటే సీట్లు ఎక్కువై, చాలా సీట్లు వృధాగా పోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇందాక చెప్పినట్టు విద్య, ఉద్యోగ రంగాలలో ప్రభుత్వం లేక రాజ్య ప్రమేయం బాగా తగ్గిపోయి కేవలం నామ మాత్రంగా ఉంది. పైగా ఈ మధ్య ప్రైవేటీకరణ బాగా పెరిగిపోయి ప్రభుత్వ రంగం క్షీణించి పోతోంది. ఈ దశలో ఓబీసీల సంఖ్యా వివరాలు ప్రభుత్వ పాలసీలను ప్రభావితం చేసి, తోడ్పడతాయి అనేది అనుమానాస్పదం.

కుల జన సేకరణ వల్ల కులం ఒక సహజమైన (అంటే జన్మత: ప్రాప్తించే అస్తిత్వం) అంతేకాక పురాతనమైన అస్తిత్వం అనే సాధారణ నమ్మకాన్ని వమ్ము చేస్తుంది అనే వాదన కూడా ఇపిడబ్ల్యు సంపాదకీయం మన ముందు ఉంచుతుంది. కులం అనేది మన సమాజానికి ఒక పెద్ద మాయని మచ్చ. ఇది జన్మత: ప్రాప్తించేదని, అతి సహజమైన, పురాతనమైన అస్తిత్వం లాంటి నమ్మకాలని మనం ఖచ్చితంగా రూపుమాపాలి. అయితే జనాభా లెక్కల ద్వారా ఇది సాధ్యపడుతుందా? లేదా? అనేదే ప్రశ్న. అంతేకాక కుల గణన ద్వారా కుల ప్రాతిపదిక కేవలం నేడు కింది కులాలకు పరిమితమై ఉండకుండా, అన్ని కులాలకి పాకుతున్నదా అన్నది కూడా మనం ఆలోచించాలి. ఆచరణలో ఎదురయ్యే సాధారణ సమస్యలే కాకుండా, ఈ కులాల లెక్కింపులతో అనేక ఇతర లోతైన సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ముందుగా కుల వ్యవస్థ అన్నది చాలా పటిష్టమైన వ్యవస్థ అన్న అపోహ ఒకటి ఉన్నది. ఇది అసలు ఏ మాత్రం నిజం కాదు. ఎంతో మంది ప్రముఖులైన సామాజిక శాస్త్ర వేత్తలు ఏ విధంగా కుల వ్యవస్థలోనూ, ప్రతి కులంలో అంతర్గతంగా మార్పులు వస్తున్నాయో వివరించారు. కాబట్టి దాన్ని ఇంకా చర్చించనవసరం లేదు. ప్రస్తుతం మనకి అవసరమైన అంశాలు రెండు ఉన్నాయి.

న్యాయమైన వివక్షని అమలు చేయటానికి ప్రధాన అడ్డంకి అసలు ఓబీసి అన్నవారు ఎవరు అని నిర్ణయించటంతో మొదలు అవుతుంది. ఈ విషయంలో స్పష్టత లోపించటం వల్ల అనేకానేక కోర్టు కేసులు, వాద ప్రతివాదాలు నమోదు అయ్యాయి. ఈ కేసుల్లో రిజర్వేషన్లు అమలు చేయమని అడిగినవి తక్కువ, అసలు ఓబీసీ పట్టికలో ఎవరున్నారు/ఎవరు లేరు, ఆ పట్టిక ఎంత వరకు సమంజసమైనది, ప్రతిపాదించిన కోటా సమంజసమైనదా? లాంటి ప్రశ్నలపై లిటిగేషన్ ఎక్కువ నడుస్తున్నది. ఇది ప్రధాన సమస్య అయినపుడు కులాల గణన ద్వారా ఈ ఓబీసీలు అనే ఖచ్చితమైన స్వరూపము లేని ఒక వర్గాన్ని నిర్ణయించటంలో ఏ విధంగా సాధ్యపడుతుందో తెలీదు. పరిస్థితిని క్లిష్టతరం చేసే మరో అంశం, అధికారులు ప్రజలని తాము ఓబీసీ కులానికి చెందిన వారా కాదా అంటే వారు ఖచ్చితంగా చెప్పగలుగుతారా? ఈ ప్రశ్నని మనం తేలికగా కొట్టిపారేయలేం. కర్ణాటక వంటి రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడిసిన్‌లో సీట్లకి ధరఖాస్తు పెట్టే అభ్యర్థులు తమ కులం పేరుని నమోదు చేయరు.

దీనికి కారణం 'క్రీమీలేయర్' అన్న ప్రాతిపదిక మీద తమకి సీటు ఇవ్వరనే భయంతో వారు ఇలా చేస్తారు. ఈ 'క్రీమీలేయర్' నిర్ణయించటంలో చాలా నిర్దిష్టమైన ప్రమాణాలు ఉండటం వల్ల ఓబీసీలు ఎవరని నిర్ణయించటంలో జనాభా లెక్కలు సేకరించే వారికి, ఆ సమాచారం అందించే ప్రజలకి కూడా చాలా ఇబ్బందులు ఎదురౌతాయి. ప్రజలకి తాము ఓబీసీలు అవునో కాదో తెలియకపోవచ్చు.

ఓబీసీలందరు ఒకే తరహా లక్షణాలు గల కులాల/వ్యక్తుల సమూహం అని భావించటం కుల గణనను సమర్థించేవారు చేసే మరో పొరపాటు. పైన వివరించినట్టు అసలు రిజర్వేషన్లు అమలులో సమస్య మొత్తం ఓబీసీలు ఎవరు? అనే ఖచ్చితమైన అభిప్రాయానికి రాలేకపోవటం వల్లనే. పైగా ఓబీసీలుగా గుర్తించబడ్డ కులాల మధ్య కూడా చాలా అంత:కలహాలు నడుస్తున్నాయి.

కర్ణాటక రాష్ట్ర రాజకీయాలను మరొకసారి ఉదాహరణగా తీసుకుంటే – అక్కడ ప్రస్తుతం జరుగుతున్న ఆధిపత్య పోరులో ప్రధాన పాత్రధారులు లింగాయత్‌లు, వొక్కలిగాలు, ఒకవైపు ఉంటే, వారితో పోటీ పడే కులాలు, ఉదాహరణకు కురుబ కులం లాంటివి ఇంకోవైపు ఉన్నాయి. ఈ కులం కూడా నేడు ఆధిపత్య కులంగా రూపాంతరం చెందే లక్షణాలు అన్నీకలది. కులాల లెక్కింపును సమర్థించే వారు ఈ తారతమ్యాలని గుర్తించకుండా, వెనుకబడిన వారందరిని ఒకే వర్గంగా పరిగణిస్తారు. ఇటువంటి నేపథ్యంలో చాలా తప్పుడు సమాచారం నమోదు అయ్యే అవకాశాలు ఎక్కువ. దీనికి సమాధానంగా దేశ్‌పాండే–జాన్‌లు, జనాభా లెక్కల యొక్క ఉద్దేశం కేవలం ప్రజలు తమ గురించి తాము అందించే వివరాలని నమోదు చేయటమే గాని ప్రతి వ్యక్తి, కుటుంబం యొక్క 'నిజమైన' కులం ఏమిటో తెలుసుకోవటం కాదు అని వాదిస్తారు. అంతేకాక, ప్రజలు తప్పుడు సమాచారం అందించటం వల్ల వారికి ప్రత్యేక లాభం ఏమీ ఉండదని కూడా వాదించారు. జనాభా లెక్కల సమాచారం కేవలం ఒక రికార్డ్‌గా పని చేస్తుంది తప్ప నేరుగా దీని వల్ల ఎటువంటి లాభాలు ఉండవు అని వారి అభిప్రాయం. కాని వారు ఒక అతి ముఖ్యమైన విషయాన్ని ఇక్కడ మర్చిపోతున్నారు.

కుల గణనని సమర్థించే రాజకీయ పార్టీలు, మరియు కొన్ని సామాజిక వర్గాలు ఈ లెక్కలను తమ వెనకున్న బలగాన్ని నిరూపించు కోవటానికే వాడుకుంటారు. ఈ విషయాన్ని వారు బాహటంగా అంగీకరించక పోయినా, మనం దానిని గుర్తించాలి. లెక్కింపులని చాలా తీవ్రంగా, బలంగా సమర్థించేవారు ప్రస్తుతం మధ్య కులాలకి చెందినవారు. వీరు తమ ఆధిపత్యం నెలకొల్పుకోవటం లేక బలపర్చుకోవటం అనే ప్రక్రియలో ఉన్నారు. అందుకని రాజకీయ, సామాజిక

శక్తులు తమ తమ ప్రజల మీద, సమూహాల మీద, ఫలానా కులం పేరు కింద నమోదు అవ్వమని ఒత్తిడి తీసుకొచ్చే అవకాశాలు లేకపోలేదు. కర్ణాటక నుంచే మరో ఉదాహరణ – ఇక్కడ 'సదర్' అనే ఒక కులం ఉంది.

దీనిలో పలు ఉపకులాలు కూడా ఉన్నాయి. అయితే ఇదే పేరుతో ఆధిపత్య కులమైన లింగాయత్‌లలో కూడా ఒక ఉప కులం ఉంది. వెనుకబడిన కులం సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులు (బహుశా కావాలనే) ఈ రెండింటినీ ఒకటిగా పరిగణించి సర్టిఫికెట్లు ఇవ్వటం మొదలు పెట్టారు. దీనితో, సహజంగానే పెద్ద వివాదం చెలరేగింది. తర్వాత ఈ 'తప్పు'ని వారు దిద్దుకున్నారు. ఈ ఉదాహరణ ద్వారా మనకి అర్థమయ్యేది ఏమిటంటే అధికారులు ప్రజలు చెప్పినదే నమోదు చేసుకున్నా, దీని వల్ల తప్పులు దొర్లే అవకాశాలు లేకపోలేదు. ఈ సమస్యకి దేశ్‌పాండే–జాన్ చెప్పిన వాదనలో పరిష్కారం లేదు.

ఈ వాదనల అన్నిటి మధ్యలో అసలు సంఖ్యాపరంగా చాలా చిన్నవి అయిన కులాల పరిస్థితి ఏమిటి? ప్రజాస్వామ్యంలో ఎన్నికల బరిలో దిగినప్పుడు అంకెలే అన్నీ నిర్ణయిస్తాయి. ఈ విధానంలో అల్ప సంఖ్యాక కులాల భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకమే. ఎల్.జి.హవనూర్ ఛైర్మన్‌గా వ్యవహరించిన కర్ణాటక వెనుకబడిన కులాల కమీషన్ యొక్క అంచనాల ప్రకారం ఆ రాష్ట్ర జనాభాలో 88 కులాలు కేవలం 0.01 శాతం జనాభా కలిగి ఉంటే, ఇంకా 347 కులాలకి చెందిన వారు అసలు ఎంత మంది ఉన్నారో మనకి ఖచ్చితంగా తెలీదు. (అసలు ఈ అంచనాలు కూడా ఎంత వరకు నిజమైనవో మనం చెప్పలేము). ఇటువంటి అల్పసంఖ్యాక కులాలు, ఈ కొత్త లెక్కింపులలో మరింత చిన్న చూపుకి, నిరాదరణకి గురి అయ్యే అవకాశం ఉంది. ఇటువంటి కులాలన్నిటినీ దగ్గర పోలికలు ఉన్న అధిక సంఖ్యాక కులాలలో చేర్చే ప్రయత్నాలు కూడా జరగవచ్చు. దీనివల్ల కులాలలో వైవిధ్యాలని, తారతమ్యాలని నమోదు చేయవలసిన జనాభా లెక్కలు, ఈ ఉద్దేశాన్ని నెరవేర్చ లేకపోతాయి.

భారత రాజ్యం నేటి వరకు పాటిస్తున్న "కులాన్ని మరుగుపరిచే ప్రయత్నం" అంటే కులాన్ని తాను చూడకపోతే, గుర్తించకపోతే, అది క్రమంగా అదృశ్య మౌతుందనే నమ్మకాన్ని వదిలి, నేటి సమాజంలో కులానికి ఉన్న అసలైన ఉనికిని గుర్తించే అవకాశం ఈ లెక్కల ద్వారా కలుగుతుందని దేశ్‌పాండే–జాన్‌లు వాదించారు. కులాన్ని మరుగుపరిచే ప్రయత్నానికి తోడు రాజ్యాంగం ద్వారా కులాన్ని చట్టపరంగా బహిష్కరణ చేసినందువల్ల కులం గురించి ప్రస్తావన గాని, బహిరంగ చర్చ గానీ మన సమాజంలో కరువైనాయి అని కూడా వారు పేర్కొన్నారు.

ఈ రెండు నిరాధారమైన వ్యాఖ్యలు మనకి ఆశ్చర్యాన్ని కలిగించక మానవు. అసలు రాజ్యాంగం కులాన్ని బహిష్కరించిందా? పైగా కులం గురించి బహిరంగ చర్చ లేదని ఎవరు అన్నారు?

అయితే వీరు పేర్కొన్న విషయంలో ఒకటి మాత్రం వాస్తవం. సాధారణంగా పై కులాల వారు తాము కులాన్ని అధిగమించామనీ, తమకి కులపరమైన పట్టింపులు లేవనీ నమ్ముతారు. ఈ వైఖరిలో కూడా వైరుధ్యాలు లేక పోలేదు. పై కులాల వారు మధ్య కులాల వారు కూడా నేడు రాజకీయాలలో కుల ప్రాతిపదికని యధేచ్ఛగా వాడుకోవటాన్ని ఏ మాత్రం వ్యతిరేకించటం లేదు. వేరు వేరు కులాలని ఒకే లక్షణంగా ఉన్న సమూహంగా పరిగణించటమే అసలైన సమస్య.

నేను చెప్పిన విషయాల ఆధారంగా కులానికి ఉన్న ప్రాముఖ్యతని గుర్తించటం లేదనుకునే ప్రమాదం ఉంది. అది ఎంత మాత్రం నిజం గాదు. కులం, దాని కొత్త పోకడలు, అది దాల్చుతున్న కొత్త రూపాలని, అవతారాలని మనం తప్పక గుర్తించాలి, అర్థం చేసుకోవాలి. అయితే జనాభా లెక్కలలో అడిగే ఒక్క ప్రశ్న ద్వారా మనకి కావలసిన సమాచారం దొరుకుతుందా అన్నది ప్రశ్న. పైపెచ్చు కులాలలో ఉన్న సూక్ష్మమైన వ్యత్యాసాలు, వైరుధ్యాలని గుర్తించే శక్తి–సామర్థ్యాలని మనం లెక్కించే అధికారులకి శిక్షణ ద్వారా కల్పించటం లేదు.

అందుచేత దీనికి వేరే పరిష్కారం ఆలోచించాలి. మద్రాసు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవెలప్‌మెంట్ స్టడీస్ వారు, యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ అండ్ ఎకనామిక్ ఛేంజ్ మరియు ఎన్ఐఎఎస్, బెంగుళూరు వారు సంయుక్తంగా 2000ల సంవత్సరంలో నిర్వహించిన ఒక సెమినార్‌లో తేల్చిన విషయం ఏమిటంటే – సమగ్రమైన, సరియైన కుల వివరాలు కావాలంటే, జాగ్రత్తగా, శ్రద్ధగా రూపొందించిన ఎత్నోగ్రాఫిక్ అంటే ఫీల్డ్ వర్క్‌తో కూడిన అధ్యయనాల ద్వారానే సాధ్యం అవుతుందనీ, అది కూడా రాజ్య యంత్రాంగం ద్వారా నిర్వహించిన అధ్యయనం కంటే ఒక స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థ ఈ కార్యక్రమం చేపట్టాలి అని వారు అభిప్రాయపడ్డారు.

**'Why the Census should Not Count Caste'**
***EPW* July 31, 2010, Volume XLV No.31 pp 79-80**

*అనువాదం : ఉమ భృగుబండ*

## జాతీయ స్థాయి కమిషన్లు వాటి సూచనలు

సం॥ 1953

జాతీయ కమిషన్: మొట్టమొదటి వెనుకబడిన తరగతుల కమిషన్-కాకా కాలేల్కర్ కమిషన్

**సూచనలు:**

- 2399 వెనుకబడిన తరగతుల గుర్తింపు లేదా వీటిలో 837 అత్యంత వెనుకబడిన తరగతులుగా విశ్లేషించటం
- స్త్రీలందరినీ వెనుకబడిన వర్గంగా గుర్తించటం
- క్లాస్ 1 లో ఓబిసీ లకు 25% , 33.3% క్లాస్ 2లో, 40% క్లాస్ 3 లో, ఇంకా 40% క్లాస్ 4 లో రిజర్వేషన్
- 1961లో కులాలవారీగా జనాభా లెక్కల్లో నమోదు చేయటం
- వివిధ అంశాల సామాజిక ప్రాముఖ్యతను గుర్తిస్తూ జనగణన కార్యక్రమం రూపొందించటం
- జనగణన కార్యాలయాలు ఆర్థిక శాస్త్రవేత్తలతోనే కాకుండా సామాజిక, ఎత్నాలజిస్టులతో వుండాలి
- జనగణన పత్రాలలో ప్రత్యేకంగా 'కులం' నమోదు చేసే విధంగా వుండాలి.
- వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం మంత్రిత్వ శాఖ

సం॥ 1978

జాతీయ కమిషన్: రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్-బి.పి.మండల్ కమిషన్

**సూచనలు:**

- ఇతర వెనుకబడిన తరగతుల కోసం 27% రిజర్వేషన్
- విద్యా రాయితీలు
- వృత్తివిద్యా శిక్షణకొరకు ఆర్థిక సహాయం
- ఆర్థిక సహకార సంఘాలు
- ప్రగతిశీల భూమి చట్టాలు
- జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం కార్పొరేషన్లు
- ఇతర వెనుకబడిన తరగతుల కోసం ఏర్పాటుచేసిన విధానాల అమలు కోసం కేంద్రీకృత సహకారం

రిఫరెన్స్: ఎమ్.ఎల్.మాథుర్(2004) ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ బాక్‌వర్డ్ కాస్ట్స్, (4 సంకలనాలు), కల్పజ్ పబ్లికేషన్స్:ఢిల్లీ.

'హరిజన్' లేదా దేవుని బిడ్డలు' అనేదాన్ని మొట్టమొదట ఉపయోగించింది గుజరాత్‌కి చెందిన కవి, సాధువు నరసింహ్ మెహత అయితే దీన్ని ముందుకు తీసుకువెళ్ళింది 1930ల్లో మహాత్మా గాంధీ. ' హరిజన్' అనే పదానికున్న చరిత్ర వల్ల ఆ పదం వాడుకను షెడ్యూలు కులాల ప్రజలు తిరస్కరించారు. రాజ్యాంగంలో కానీ, చట్టపరమైన పదజాలంలో గానీ ఈ మాటకు ఏరకమైన స్థానం లేదు. దీనితో భారత ప్రభుత్వం 'హరిజన్' అనే పదాన్ని ఎలాంటి అధికారిక పత్రాలలోకానీ, సంబంధిత విషయాలలో కానీ వాడకూడదని అవసరమైన సర్క్యులర్లను అన్ని విభాగాలకు విడుదల చేసింది.

హోం మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, సర్క్యులర్ తేది. ఫిబ్రవరి 10, 1982.

# కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు

■ సతీష్ దేశ్‌పాండే, మేరీజాన్

ప్రస్తుతం కుల జనగణన గురించి జరుగుతున్న చర్చలలో, దాన్ని సమర్థించేవాళ్ళు, వ్యతిరేకించే వాళ్ళు కూడా, వాస్తవాలపైన కన్నా, 'ఇట్లా జరిగితే ఈ పరిస్థితులు వస్తాయేమో' అన్న ఊహాగానాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. ఉన్న పరిస్థితులను మార్చాలను కుంటున్న వారికి, అంటే కుల జనగణనను సమర్థించే మావంటి వారిపై దీని వల్ల జరిగే పరిణామాలను, విషయాలను విశదీకరించాల్సిన బాధ్యత ఎక్కువ ఉంది. అయితే ఇప్పుడు ఉన్న పరిస్థితి తటస్థమైందనే వాదన పూర్తిగా తప్పు. కులాలని లెక్కించకపోవడం వలన భారతదేశం ఎంత నష్టపోయిందనే ప్రశ్న ఇప్పటికైనా వేసుకోవాలి. అప్పుడే మనకు కులగణన కావాలంటున్న వారి రాజకీయాలే కాక, కులగణన వద్దంటున్న వారి రాజకీయాలు కూడా చర్చింటానికి వీలవుతుంది. ఈ వ్యాసంలో మేము కుల జనగణనపై జరుగుతున్న చర్చల్లో, కులం, జనగణన గురించి అంతర్లీన (implicit) నమూనాలు, అంశాలను చర్చించ దలచుకున్నాము. మా ఉద్దేశంలో చర్చలు అప్రామాణికంగా వుండటానికి ప్రధాన కారణం - పక్షపాత ధోరణులు కాదు, చర్చించే విషయాల పట్ల తగినంత జాగ్రత్త తీసుకోకపోవటమే.

**కుల జనగణన : అంతర్లీన నమూనాలు**

కుల జనగణనను వ్యతిరేకించే వాదనలు రెండు రకాలుగా వుంటాయి - మొదటివి, రాజకీయ-నైతిక కోణాల నుండి వాదిస్తే, రెండోవి ఆ ప్రక్రియ చేపట్టడంలో ఆచరణాత్మక, సాధక బాధకాలు అధిగమించలేనివని వాదించేవి. చాలా వరకు కుల జనగణనను సమర్థించే వాదనలు రాజకీయ-నైతిక కోణాల నుండి వుంటూ, కొంత మేరకు, రెండో రకమైన వాదనలను తిప్పికొట్టేవిగా వుంటాయి. ఈ రెండు రకాల వాదనలు కేవలం ఒక దాన్నొకటి వ్యతిరేకించటానికే పరిమితమయ్యాయని చెప్పి పూరుకోలేం. ఎందుకంటే రెండు వాదనలూ కూడా కులం, జనగణన గురించి పరోక్షంగా (implicit) కొన్ని ఆలోచనలపై ఆధారపడతాయి.

జనగణన, దాని ఉద్దేశాల గురించి మనకు మూడు రకాల నమూనాలు ఈ వాదనలలో అగుపడతాయి. మొదటి నమూనా, జనగణనను సామాజిక సంక్షేమం లేదా సామాజిక న్యాయ విధానానికి అనుబంధమైనదిగా చూస్తుంది. దీని ప్రకారం జనగణన ఈ పథకాలని మరింత సమర్థవంతంగా అమలుపరచడానికి ఉపయోగపడే ఒక సాధనం. రెండో నమూనాలో జనగణన, అస్తిత్వాలను స్థిరపరిచే లేదా 'బలవంతపు (స్థిరమైన) అస్తిత్వాలను సృష్టించే' ప్రక్రియ. దీని ప్రకారం జనగణన ప్రతి పౌరునికి ఒక స్థిరమైన కుల అస్తిత్వాన్ని ఏర్పరచి, సార్వజనీన భారతీయ పౌరులను రూపొందించే ప్రక్రియకు పూర్తిగా గండి కొడుతుంది. మూడో నమూనా రెండో నమూనాకన్నా ప్రాధాన్యతలో కాదు గాని, ప్రచారంలో కాస్త తక్కువగా వుంది. ఇది జనగణనను, గణాంకాల ద్వారా వర్గీకరించిన విషయాల (క్యాటగిరి) సత్యాన్ని కనుక్కోవటానికి రూపొందించిన అతి పెద్ద పరిశోధనా ప్రాజెక్టుగా పరిగణిస్తుంది. దీని ప్రకారం, జనగణనను పక్కాగా, సత్యాన్వేషణ కోసం చేస్తే తప్ప పనికిరాదు.

ఈ మూడూ కాకుండా, ఇంగ్లీష్ మీడియాలో లీలగా కనిపించి, హిందీ మీడియాలో కొంచెం ఎక్కువగా కనపడిన నాలుగో నమూనా ఇంకొకటుంది. జాతీయోద్యమ రచనల ద్వారా మనకు పరిచయమైన ఈ నమూనాలో - జనగణన ఒక సామూహిక స్వీయ ముఖ చిత్రం. అమూర్త (abstract) జాతీయ సమూహానికి యదార్థ రూపాన్నివ్వడానికి మనం రూపొందించుకున్న జాతీయ జెండా, మ్యాప్ వంటి ఇతర పరికరాల్లాగా జనగణన కూడా జాతికి ఒక రూపాన్నిస్తుంది. దీని ప్రకారం జనగణన కేవలం సామాజిక న్యాయం గురించో, అస్తిత్వాలని స్థిరపచడానికో, జ్ఞాన సముపార్జనకో కాదు, అది సముదాయ/సామూహిక అస్తిత్వాలను సేకరించుకునే ప్రక్రియ. అందరూఈ ప్రక్రియలో పాల్గొంటారు కాబట్టి, ప్రతి సముదాయానికీ, మిగతా వారితో పోల్చుకుంటే తామెక్కడున్నామని చూసుకోవటానికి అవకాశం కలుగుతుందన్నమాట. ఇటువంటి సమగ్రమైన సముదాయాల చిత్రాలను, కేవలం జనగణన మాత్రమే ఇవ్వగలదు. ఏ ఒక్క వ్యక్తికీ లేదా సముదాయానికీ ఇటువంటి ప్రక్రియ చేపట్టగల అధికారం, వనరులు లేవు/వుండవు.

ఈ చర్చల్లో అంతర్లీనంగా కులం గురించి ఈ క్రింది నమూనాలు కనిపిస్తాయి. మొదటిగా, అన్నిటికన్నా ఎక్కువగా మనకి కనిపించే నమూనాలో, కులం అంటే, 'కింది కులాలు' అనే అర్థంలో వాడతారు. దాదాపు జెండర్ అంటే స్త్రీలు, రేస్ అంటే నల్ల జాతి వారు అనే అర్థంలో వాడినట్లు ఇక్కడ కులం అంటే క్రింది కులాల సమస్యలు, ముఖ్యంగా రిజర్వేషన్లు, కోటాలు, ఓటు బ్యాంకులు అన్నమాట. సామాజిక మానవ శాస్త్ర ప్రభావితమైన రెండో నమూనా, కులాన్ని రోజువారి జీవితాన్ని క్రమబద్ధీకరించి అర్థవంతం చేసే సంక్లిష్ట నిర్మాణంగా చూస్తుంది. ఇక్కడ కులాన్ని వర్గానికి లేదా ఎత్నిక్ గుంపుకి కుదించి వేసే ధోరణిని అడ్డుకోవడంపై ఎక్కువ దృష్టి ఉంటుంది. మూడవ నమూనా, కులాన్ని వర్గంతోపాటు అధికారం, వనరులు, ఆధిక్యతల పంపకాన్ని నిర్దేశించే పంపిణీ సంబంధాల నెట్‌వర్క్‌లాగా చూస్తుంది. దీని ప్రకారం కులాన్ని ఈ సంబంధాల నెట్‌వర్క్‌లోనే అర్థం చేసుకోగలం. ఆ సంబంధాలు సామరస్యపూర్వకంగా లేకపోయినా, సంఘర్షణతో కూడుకున్నవైనా సరే, దానిలో భాగాలు మొత్తాన్నించి విడదీసి చూస్తే అర్థం కావు, నాలుగో నమూనా కులాన్ని ఆధునికతని నిరోధించే అతి పెద్ద అడ్డంకిగా చూస్తుంది. కేవలం భారత దేశాన్ని పట్టి పీడించే ఈ రోగం, అన్య-ఆధునిక విలువలపై ఆధారపడి, మనల్ని పూర్తిగా ఆధునికులు కాకుండా, మనలో సార్వజనీన, వ్యక్తివాద విలువలు పెంపొందకుండా చూస్తుందని దీని ప్రధాన వాదన.

ఇక్కడ మా ఉద్దేశం కులాన్ని, జనగణనని సమగ్రంగా చర్చించటం కాదు. ఈ నమూనాలు కేవలం సూత్రప్రాయమే. ఎన్ని రకాల దృక్కోణాల నుండి ఈ విషయాలను చూడవచ్చు అని సూచనప్రాయంగా చెప్పటానికి మాత్రమే వీటిని చర్చిస్తున్నాం. అయితే ఈ నమూనాలు, దృక్కోణాలూ కూడా పాక్షికమైనవే కాక, ఒకదానితో ఒకటి కలిసి వుంటాయి. అలాగే, ఒకే దృక్కోణం కులం పట్ల, జనగణన పట్ల విభిన్న దృక్పథాలని తనలో ఇముడ్చుకోగలదు కూడా. క్లుప్తంగా చెప్పాలంటే కులం, జనగణనల గురించి అందుబాటులో వున్న నమూనాలే, కుల జనగణనకు సంబంధించిన వాదనలకు రూపునిస్తాయి. ఆయా వాదనలకున్న పరిమితులను, సాధ్యాసాధ్యాలను కూడా నిర్ణయిస్తాయి. అందుకోసమే, కుల జనగణనపై చర్చను అర్థం చేసుకోవటానికి, విశ్లేషించటాని కంటే ముందు ఈ వాదనలకు జీవం పోసే పరోక్ష నమూనాలను వెతకటం చాలా అవసరం

**జనగణన సాధ్యాసాధ్యాలు - సమస్యలు**

కుల జనగణనను వ్యతిరేకించేవాళ్ళు ముఖ్యంగా ఇది అసాధ్యమని వాదిస్తారు. ఈ వాదనను అకడమిక్ రంగంలో వున్నవారు కూడా సమర్థిస్తారు. అయితే ఈ వాదనకున్న అనేక భాగాలను జాగ్రత్తగా విడదీసి పరిశీలించాల్సిన అవసరముంది.

బలమైన వాదన చేసేవారు జనగణన 'పరిశోధనా ప్రాజెక్టు' నమూనాను, కులాన్ని 'అర్థాన్నిచ్చే సంక్లిష్ట నిర్మాణం' నమూనాతో కలిపి మొదటి దానికి (జనగణనకు) రెండో దానికున్న పలుకోణాల(కుల వ్యవస్థ)ను అధ్యయనం చేయగలిగే సత్తా, కెపాసిటీ లేదని చెప్తారు. మరి కొంత మంది, కులం చాలా అస్థిరమైన, అనేక అర్థాలున్న అస్థిత్వమని వాదిస్తూ, మీ కులమేమిటి? అనే ప్రశ్నకు

---

**దళిత్:**

పదకోశశాస్త్రం (ఎటిమాలజీ) ప్రకారం 'దళిత్ ' అనే పదం ఈ కింది అనేక అర్థాలను ఇముడ్చుకుంది. అవి, 'బ్రోకెన్', 'క్రష్డ్', 'డౌన్‌ట్రాడెన్', 'డిశడ్వాంటేజ్డ్', 'అండర్ ప్రివిలేజ్డ్', 'డిస్‌పొసెస్డ్', 'డిప్రయివ్డ్', 'హేండీకాప్డ్', 'అబ్యూస్డ్', 'హంబుల్డ్', 'ప్రొస్ట్రేట్'.

దళిత్ అనే పదం మొట్టమొదటిసారిగా 1931లో 'అంటరానివాళ్ళు' అనే పదప్రయోగానికి వ్యతిరేకంగా వార్తా కథనాల్లో కనిపించింది. 1970ల ప్రారంభంలో మహారాష్ట్రలో ఆవిర్భవించిన దళిత్ పాంథర్స్ ఉద్యమం తర్వాత ఈ పదం మరింత విస్తృతమయింది.

సందర్భానుసారంగా ఒక్క సమాధానంకంటే ఎక్కువ వస్తాయని, అనేక సమాధానాలు కూడా రావచ్చని వాదిస్తారు. వారన్నది కొంత వరకూ నిజమే. సూక్ష్మస్థాయిలో కులాలు ఉపకులాలు, వాటిలో ఉపకులాలుగా ఉంటూ, రాష్ట్ర లేదా జాతీయ స్థాయిల్లో మిగతా కులాలతో కలిసిపోయిపెద్ద కుల సమూహాలుగా కన్పిస్తాయి. ఉదాహరణకు, మరాఠీలు, లింగాయత్‌లు, క్షత్రియులను తీసుకోవచ్చు.

కులమేమిటి అన్న ప్రశ్నకు సందర్భానుసారంగా సమాధానం కొంత మారొచ్చు. కొడుక్కి పెళ్ళి సంబంధం వెతుకుతుంటే ఒకటి, ఎవరిదగ్గర్నుండైనా సహాయం అర్థించినపుడు మరోటి, ఎవరికి ఓటు వెయ్యాలో నిర్ణయించుకునేటపుడు ఇంకోటి. అయితే ఇది జనగణనకు ఎందుకు, ఎట్లా సమస్యవుతుందో మాకు స్పష్టంగా లేదు.

కులం చెప్పక్కర్లేని / అవసరం లేని పై కులాలకి తప్ప, సాధారణ భారతీయునికి తనకులమేమిటో తెలియని, చెప్పలేని ప్రాథమిక అనుమానాలుంటాయని అనుకోలేం. సందర్భానుసారం అనుకున్నా కూడా, జనాభా లెక్కల అధికారికి ఇచ్చే సమాధానం ఆ సందర్భానుసారం ఇస్తాం. వేరే చోట్ల మనం ఇచ్చిన సమాధానాలు ఇక్కడ ఇవ్వం కదా!

2001 సంవత్సరం నుండి జనాభా సమాచారం క్రోడీకరించే అధికారులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. చేతిరాతను గుర్తించి దానిని స్కాన్ చేసి డిజిటైజ్ చేయటం, చవకగా డేటాను స్టోర్ చేయటం, డేటా వెలికి తీయటానికి తేలిక పద్ధతులు, అంతే కాకుండా క్రింది స్థాయిలో డేటాను భద్రపరచటం వంటి పద్ధతులు అవలంబిస్తున్నారు. ఇందువల్ల మార్పులు, చేర్పులు కింది స్థాయి నుండి పై స్థాయి వరకూ సులభతరమయినాయి. కుల పర్యాయపదాలిప్పుడు సమస్యకాదు. కొత్త సమాచారం సేకరించటం కూడా గణనాధికారుల సమయంపైనే ఆధారపడుతుంది తప్ప ఆ సమాచారాన్ని క్రోడీకరించడంలో వేరే సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలు తక్కువ. కుల పర్యాయపదాలు సాధారణంగా ఒక 'కేంద్రపదం' చుట్టూ గుమిగూడి వుంటాయి గానీ మరీ ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా ఉండవు. జనగణన చేసే స్థానిక ఉపాధ్యాయులు గుర్తించలేనంతగా కుల పర్యాయపదాలుంటాయని అనుకోవటం కష్టం.

**పెద్ద సంఖ్యలో కులాలు?**

కులగణనని వ్యతిరేకించే వారు పెట్టే ఇంకొక విచిత్రమైన వాదనొకటుంది. చాలా పెద్ద సంఖ్యలో కులాలను లెక్కించవలసి వస్తుందనేది. ఉదాహరణకు, 2001 జనగణనలో ఎస్.సిలలో 1234 కులాలు ఎస్.టిలలో 698 ఆదివాసీ సమూహాలు లెక్కించారు. 1971, 1981, 1991ల జనగణనలలో దాదాపు 1700 మతపరమైన సమూహాల పేర్లు బయటికొచ్చాయి. వాటన్నింటినీ అధ్యయనం చేయటానికి ఒక ప్రత్యేకమైన 'వర్కింగ్ గ్రూప్'ను కూడా నియమించారు. మరి ఈ సంఖ్యలు, ఎస్.సి, ఎస్.టి అనే వర్గీకరణకు అర్థం లేకుండా చేస్తాయా? లేదు, ఎందుకంటే 1.2 బిలియన్ ప్రజలున్న మన దేశంలో (అంటే 12పక్కన ఎనిమిది సున్నాలన్నమాట) మనం పెద్ద పెద్ద సంఖ్యలలో కులాలను, ఇతర సమూహాలను ఊహించి, ఒప్పుకోవాలి తప్ప, ఆ సంఖ్యలోనే ప్రమాదం ఉందనుకోవటం హాస్యాస్పదం. సముదాయాలను చూసే దృష్టి కోణంలో తప్ప, సంఖ్యలకు వాటంతటవే అర్థాలుండవు.

అంత పెద్ద సంఖ్యలో కులాలను లెక్కిస్తే వాటి మధ్య పోలిక, తేడాలు గుర్తించటం కష్టమవుతుందనేది అనేది ఈ కోవలోనే వచ్చే ఇంకొక వాదన. అయితే ఈ వాదన కృత్రిమమైనది. 1234 ఎస్.సి కులాలున్నాయనే విషయానికి జాతీయ స్థాయిలో ఏ ప్రాధాన్యత లేదు. ఎందుకంటే ఏ కులాలు, తెగలు 'షెడ్యూలు'లో చేర్చబడతాయనేది ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల బట్టి నిర్ణయిస్తారు. ఈ భయాన్ని అధిగమించటానికి మనం ఒక సాధారణ సూత్రాన్ని కూడా ప్రతిపాదించవచ్చు. జాతీయ స్థాయిలో కాకుండా జిల్లా స్థాయిలో, లేదా తాలూకా స్థాయిలో మాత్రమే మనం ఇటువంటి డేటాను (ప్రామాణిక సమాచారం) వర్గీకరించాలని, రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో చెయ్యాలనుకున్నప్పుడు అధికారులు దాని కోసం ప్రత్యేకంగా అనుమతి చేసుకుని మరీ చెయ్యాలని – ఇటువంటి జాగ్రత్తలు తీసుకోవచ్చు.

**రాజకీయపరమైన అభ్యంతరాలు**

చివరిగా రాజకీయపరమైన అభ్యంతరాలకి వస్తే, మనకి ముఖ్యంగా కనపడేది కుల గణన మనని వలస పాలకుల యుగం నాటి 'విభజించి పాలించు' విధానాలకి తీసుకువెళు తుందనే వాదన. అయితే, వలస పాలకుల జనాభా లెక్కలు, మనను విభజించడమే కాకుండా, మన జాతీయ వాదానికి, భారత దేశ భావన రావటానికి కూడా సాయం చేసాయి. అంతేకాకుండా, విభజించి పాలించు అనే భావన గురించి మాట్లాడేటప్పుడు, మనం ఎవరి వైపు నుండి మాట్లాడుతున్నామనేది కూడా ఆలోచించుకోవాల్సి వుంటుంది. భారత దేశంలోని అత్యధిక ప్రజానీకానికి (ప్రజలకు), ఈ వలసవాద కాలంలోనే, శతాబ్దాలపాటు అవిచ్ఛిన్నంగా సాగిన కులీన వర్గాల అధికారానికి వ్యతిరేకంగా పోరాడటం సాధ్యమయింది. బ్రిటిష్ వారు రాకుంటే, అటువంటి తిరుగుబాటు సాధ్యమయి వుండేది కాదు. తమను తామ జాతికి యజమానిగా భావించుకునే కులీన వర్గాలకు మాత్రమే, అధికార పంపిణీ గురించి ఈ వర్గాలు చేస్తున్న అలజడి విడిపోవడంగానో, చీలిపోవటంగానో అన్పిస్తుంది. అంతేకాక, సమకాలీన సందర్భంలో, ఈ విభజనకున్న అర్థం కూడా వేరు. ఇప్పుడెవరూ కూడా, దేశం నుండి చీలి పోవటం వల్ల తమ భవిష్యత్తు బాగుపడుతుందని భావించట్లేదు. అందరూ, ఉన్న దేశంలో, అధికార భాగస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. క్లుప్తంగా చెప్పాలంటే, మనం ఇరవయ్యవ శతాబ్దపు మధ్యలో, ప్రతి రోజూ కొత్త దేశాలు ఆవిర్భవిస్తున్న కాలంలో లేము. వేరే చారిత్రక సందర్భంలో వున్నాము. విభజన గురించి మాట్లాడే వారికి మాత్రమే, రాజకీయ ఎజెండాలు ఉంటాయనుకోవటం తప్పు. ఐక్యతా నినాదాలు కూడా అమాయకత్వంతో లేదా ఉపకారం చేద్దామనే ఉద్దేశాలతోనో రావు!

**కుల అంధత్వాన్ని బద్దలుకొడదాము**

ఇప్పుడు మనం, మేము సమర్ధించే వాదనలకి, నమూనాలకి వద్దాం. కులాన్ని లెక్కించకపోవటం, స్వతంత్ర భారత దేశం చేసిన పెద్ద తప్పుల్లో ఒకటని మేము ఇక్కడ ముఖ్యంగా

'పీడిత వర్గాలు' : 'పీడిత వర్గాలు' అనే పదం 1901, 1911 జనగణనలో మనం చూడం. ఏదేమైనా, భారత ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు ఇచ్చే మార్గదర్శకాలలో ఈ పదానికి వున్న అర్థాన్ని పొందుపరచటం జరిగింది. భారత ప్రభుత్వ హోం శాఖ 1916లో మార్చి 12న విడుదల చేసిన లేఖ నెం:351లో, అన్ని స్థానిక ప్రభుత్వాలు 'పీడిత వర్గాల' గణాంకాలను ఇచ్చేటపుడు ఈ కింది వర్గీకరణను అమలు చేయాలని ఆదేశించింది.

1. 'పీడిత వర్గాలు' అంటే అంటరాని వాళ్ళు

2. మూలవాసులు మరియు కొండప్రాంత ఆదివాసీలు

3. "నేరపూరిత ఆదివాసీలు"

భారత ప్రభుత్వ విద్యాశాఖ కమీషనర్ అయిన సర్ హెన్రీ షార్ప్ "పీడిత వర్గాలు" అనేమాటకు తాను ఇచ్చిన అర్థంలో "నేరపూరిత ఆదివాసీలు", "మూలవాసులు", కొండప్రాంత ఆదివాసీలు" గురించి పొందుపరచలేదు. ఈ పదాన్ని 'శుభ్రతలేని కులాలు' గా పరిమితం చేశాడు.

1913 లో వున్న సౌత్‌బారో ఫ్రాంచైజ్ కమిటి 'పీడిత వర్గాల' ను నిర్వచించటానికి 'అంటరానివాళ్ళు' అనేమాటనే ఉపయోగించింది.

'అంటరానితనం' అనే దాని పునాది మీదనే 'పీడిత వర్గాల' అంశం గురించి ఒక రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. డా.బి.ఆర్.అంబేడ్కర్, ఆర్.శ్రీనివాసన్ ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఒక మెమొరాండం సమర్పిస్తూ, 'పీడిత వర్గాలు/కులాలు' అనేపేరును ఎట్టిపరిస్థితుల్లోను వాడకూడదని ప్రత్యేకంగా చెప్పారు. ఏదిఏమైనా, ఈ పదానికి సరయిన అర్థాన్ని సాధించటానికి ఏర్పాటైన ఇండియన్ ఫ్రాంచైజ్ కమిటీని లోథియన్ కమిటీగా కూడా పిలిచేవారు.

ఈ కమిటీకి ఇచ్చిన నోట్‌లో డా.బి.ఆర్.అంబేడ్కర్ 'పీడిత కులాలు' అనే మాట చాలా అవమానపరిచేదిగా, విఘాతం కలిగించేదిగా వుందని పేర్కొన్నారు.

నూతన రాజ్యాంగంలో అధికారిక అవసరాల కోసం, 'హిందూ కులాలకు చెందని వారిగా', 'ప్రొటెస్టెంట్ హిందువులు'గా, 'నాన్ కన్ఫర్మిస్ట్ హిందువులు' గా, వదిలివేసిన కులాలు లేదా బయటవున్న కులాలు' గా లేదా ఈ అర్థాన్ని సూచించేవిధంగా వుండాలి తప్పించి 'పీడిత వర్గాలు/కులాలు' గా వుండకూడదని డా.బి.ఆర్.అంబేడ్కర్ సూచించారు.

అస్సామ్ జనగణన సూపరింటెండెంట్ అయిన సి.యస్.ముల్లన్ 1931లో జరిగిన జనగణన కార్యక్రమంలో 'పీడిత వర్గాలు/కులాలు' అనేమాటను వ్యతిరేకించి వాడనీయలేదు. పైగా 'హిందూ అవతలి కులాలు' అనే ఒక కొత్త పదాన్ని ఉపయోగించాడు.

చెప్పదలుచుకున్నాము. బహుశా తప్పు చేశామనే విషయం కూడా, మనకిప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటేనే అర్థమవుతోంది కాబట్టి ఈ తప్పుని మనం అనివార్యంగా భావించాలేమో! 'కుల-అంధత్వ' విధానాల వల్ల జరిగిన నష్టం కళ్లుండి చూడాలనుకునే వారికెవరికైనా కనపడుతుంది/ అర్థమవుతుంది. కుల గణనని వ్యతిరేకించే వాళ్ళు చాలా మంది ఉన్న పరిస్థితిని తటస్థమైనదిగా చూడాలనుకుంటారు. కాని అది తటస్థమైనది కాదు. వ్యతిరేకించే వాళ్ళు కుల గణన చేస్తే వచ్చే నష్టాలే కాదు, చెయ్యకపోవటం వలన మనకొచ్చిన లాభాలని కూడా చెప్పాలి. మా ఉద్దేశంలో, జనగణనని ఒక సామూహిక స్వీయ ముఖచిత్రంగా చూసుకోవటం సరైన నమూనా. ఈ నమూనాని, కులగణన పంపిణిలో పనికొస్తుందనే వాదనతో కలిపి చూస్తే, ఈ క్రింది విశ్లేషణకు దారి తీస్తుంది.

కుల గణనని అడగటానికి అన్నింటికన్నా ముఖ్యమైన కారణం – భారత రాజ్యం, మెయిన్‌స్ట్రీం రాజకీయాలు ఇప్పటి వరకు పాటించిన కుల అంధత్వ నమూనాను బద్దలుకొట్టడానికి ఇది ఒక మంచి అవకాశం కల్పిస్తుంది. ఈ కుల అంధత్వ దృక్పథం, కులాన్ని నిర్మూలించాలనే రాజ్యాంగ విలువను సాకుగా తీసుకుని, మొత్తానికి కులం గురించి బహిరంగ చర్చను బహిష్కరించడంలో సఫలీకృతమయింది. ఎస్.సిలను, ఎస్.టిలను, ఈ కుల అంధత్వానికి తప్పని మినహాయింపులుగా చూసింది. అయితే కులాన్ని, చట్టపరంగా బహిష్కరించిన భారత రాజ్యం, కులం వల్ల సంక్రమించే ఆధిపత్యాన్ని, అధికారాన్ని నిర్మూలించడానికి గట్టి ప్రయత్నాలు మాత్రం చేయలేదు. అందువలనే, ఈ సగం సగం కుల వ్యతిరేక విధానాలు, కులాల మధ్య అసమానతలని కొనసాగించటానికి, పెంపొందించటానికి పనికొచ్చాయి. ఈ దృక్పథం అర్థ శతాబ్దం జరుపుకున్న తరువాత, మనకి మండల కమిషన్ వివాదం ఎదురయింది. అనేక కింది కులాలకు తమకు రాజకీయంగా దక్కవలసిన వాటికి, దేశంలో తాము పొందుతున్న వాటికి మధ్య ఉన్న పెద్ద అంతరాలని విస్మరించలేని సమయం ఎదురయిన చారిత్రక సందర్భం ఇది. కింది కులాలలో కుల స్పృహ పెరుగుతున్న సమయంలోనే పై కులాలలో కూడా, తాము కులాన్ని వదిలేసి, కులరహితమయి పోయామనే ఒక (అప)నమ్మకం పెరిగింది. పై కులాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వారు మూడు తరాలపాటు ఈ కుల అంధత్వ విధానాల వల్ల అవకాశాలు పొందిన వారు కాబట్టి ఒక రకంగా వారికి ఈ నమ్మకం వర్తిస్తుంది. వారికిప్పుడు తమ కులాన్ని చెప్పుకోవాల్సిన అవసరం కూడా లేదు. అన్ని రకాల అధికార అవకాశాలు – ఆస్తి, విద్య, తమలాంటి వారితో కనెక్షన్లు అన్నీ వచ్చేశాయి వారికిప్పుడు. ఈ పై కులాల సముదాయాల వారే ఇప్పుడు కుల అంధత్వాన్ని సమర్థించే వారిలో ముఖ్యులిప్పుడు. వీళ్ళ ఉద్దేశంలో, జనగణన అంటే కింది కులాల కోసం, వాళ్లెప్పుడూ కొట్లాడుకునే కోటాల గురించి లెక్కలు తీయటం. జనగణనను సామూహిక స్వీయ ముఖ చిత్రంగా పరిగణించినపుడు అందరి కులాలను లెక్కించాల్సి వుంటుంది. ఇన్నాళ్ళూ, కుల అంధత్వ విధానాల వలన కలిగిన ఫలితాలని, ఎవరికి కన్పించకుండా అనుభవిస్తున్న పై కులాల వారితో సహా. ఈ రకంగా చూస్తే, కుల గణన, కులాన్ని అధిగమించాలనే ప్రయత్నంలో ఘోరంగా విఫలమయిన భారత దేశ చరిత్రలో ఒక అధ్యాయాన్ని ముగించి, మరో సరికొత్త అధ్యాయాన్ని మొదలుపెడ్తున్నట్లు అనుకోవచ్చు.

**'The Politics of Not Counting Caste'**

***EPW* July 19, 2010 Vol XLV, No.25 pp 39-42**

సంక్షిప్తానువాదం : ఎ.సునీత










## షెడ్యూలు కులాలు

బెంగాల్ ప్రావిన్షియల్ ప్రభుత్వం ' పీడిత వర్గాలు' అనే పదం బదులు 'షెడ్యూలు కులాలు' గా ప్రతిపాదించింది. అందుకే 'షెడ్యూలు కులాలు' అనే పదప్రయోగం 1935 భారత ప్రభుత్వ చట్టం లో మొదటి షెడ్యూలు చాప్టర్ 2 సెక్షన్ 26లో చేర్చటం జరిగింది.

1935 భారత ప్రభుత్వ చట్టం కోసం ఈ కులాలను, గుంపులను 'షెడ్యూలు కులాలు' గా పేర్కొంటూ షెడ్యూలు కులాలకు సంబంధించి 1936 భారత ప్రభుత్వ ఆర్డర్ ను ప్రభుత్వం విడుదల చేసింది.

నిజం చెప్పాలంటే, 'షెడ్యూలు కులాలు' అనే పదం కేవలం రెండు పదాల కలయిక మాత్రమే. అంతకు మించి వేరే ఏ అర్థమూ లేదు. అవి, షెడ్యూలు కులాలు లేదా 'షెడ్యూలు' కింద ఉంచబడిన కులాలు.

రాజ్యంగంలోని 303 ఆర్టికల్ ఏం చెబుతుందంటే:

షెడ్యూలు కులాలు అంటే, అలాంటి కులాలు, జాతులు లేదా ఆదివాసీలు లేదా ఇటువంటి కులాలలోని కొన్ని గుంపులు, జాతులు, ఆదివాసీలు ఈ రాజ్యాంగం అవసరాల కోసం, రాజ్యాంగంలోని 300ఎ ఆర్టికల్ ప్రకారం షెడ్యూలు కులాలుగా పిలవబడతారు.